

# ప్రజాస్ఫూర్తి

PRAJASPOORTHI TELUGU DAILY

తెలుగు దినపత్రిక

PS NEWS

మేడ్చల్ - మల్కాజిగిరి | ఎడిటర్ - గడ్డమీది బాలరాజు | శుక్రవారం 07-02-2025 | సంపుటి - 21 | సంచిక -290 | రూ : 4 | పేజీలు: 8



# భువన్ సర్వే మళ్లీ మొదలు..

- **పట్టణాల్లో పక్కాగా ఆస్తుల వివరాల నమోదు**

హైదరాబాద్: రాష్ట్రంలోని అన్ని పట్టణ స్థానిక సంస్థల పరిధిలో ఆస్తుల వివరాలను కచ్చితంగా నమోదు చేసేందుకు గతంలో చేపట్టి.. ఆగిన భువన్ సర్వేను మళ్లీ మొదలుపెట్టనున్నారు. ఇప్పటికే దాదాపు మూడొంతులు పూర్తికాగా మిగతాది కూడా పూర్తిచేయాలని అధికారులు భావిస్తున్నారు. సర్వేలో భాగంగా ఉపగ్రహ ఆధారితంగా ఫోటోలు తీయడంతోపాటు క్షేత్రస్థాయిలో సిబ్బంది పర్యటించి ఆయా ఆస్తుల తీరుతెన్నులను నమోదు చేస్తారు. వాటి వాస్తవ విస్తీర్ణాన్ని గుర్తించి.. తదనుగుణంగా పన్ను విధిస్తారు. ప్రతి ఆస్తికి 10 అంకెల ప్రాపర్టీ ట్యాక్స్ ఐడెంటిఫికేషన్ నంబర్ (పీటిన్)ను కేటాయిస్తారు.

**అవకతవకలకు అడ్డుకట్ట..**

రాష్ట్రంలోని పట్టణ స్థానిక సంస్థలు ఏటా దాదాపు రూ.900 కోట్ల ఆస్తిపన్ను వసూలు చేస్తున్నాయి. అయితే పన్ను విధింపులో అనేక అవకతవకలు జరుగుతున్నాయన్న ఆరోపణలున్నాయి. పలు ప్రాంతాల్లో యజమానులు స్థానిక సిబ్బందితో కుమ్మక్కై ఆస్తి విలువ తక్కువగా చూపించి.. తక్కువ పన్ను చెల్లిస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. అలాగే వాణిజ్యపరమైన ఆస్తిని నివాసగృహంగా చూపించి కూడా పన్ను మతలబులు చేస్తున్నారు. ఇలాంటి అవకతవకలకు చెక్ పెట్టే ఉద్దేశంతోనే ప్రతి ఆస్తిని ఉపగ్రహ ఆధారిత మ్యాపింగ్ చేయాలని తలపెట్టి, 2020లోనే లాంఛనంగా జీహెచ్ఎంసీ మినహా రాష్ట్రవ్యాప్తంగా ఈ సర్వేను ప్రారంభించారు. అనంతరం కరోనా కారణంగా దాదాపు రెండేళ్లపాటు ఇది నిలిచిపోయింది. రాష్ట్రంలో దాదాపు 20 లక్షల గృహాలను ఇలా మ్యాపింగ్ చేయాలని తలపెట్టారు. 2023లో సర్వే తిరిగి ప్రారంభమైనప్పటికీ తర్వాత వరుసగా వచ్చిన ఎన్నికల కారణంగా మళ్లీ అంతరాయం ఎదురైంది. ఇప్పుడు మిగతా సర్వేను పూర్తిచేయాలని అధికారులు

తరువాయి 2లో

# గీత దాటొద్దు..!

- **సమస్యలుంటే పార్టీకి చెప్పండి**
- **బహిరంగంగా మాట్లాడటం మంచిది కాదు**
- **ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హెచ్చరిక**
- **'స్థానిక' ఎన్నికలు ప్రతిష్ఠాత్మకం..**
- **పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లండి**
- **కాంగ్రెస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు సీఎం దిశానిర్దేశం**

హైదరాబాద్ : ఎమ్మెల్యేలకు ఏమైనా సమస్యలుంటే పార్టీకి చెప్పాలి తప్ప బహిరంగంగా మాట్లాడటం మంచిది కాదని, అలా చేస్తే ప్రజల్లోకి తప్పుడు సంకేతం వెళ్లే ప్రమాదముంటుందని.. ఎవరూ పార్టీ గీతను దాటొద్దని, ఇలాంటివి ఎవరు చేసినా సహించేది లేదని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పరోక్షంగా హెచ్చరించినట్లు తెలిసింది. స్థానిక సంస్థల ఎన్నికలు ఎప్పుడు జరిగినా కాంగ్రెస్ తప్పనిసరిగా విజయం సాధించాలని.. ఇందుకు ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని ఆయన దిశానిర్దేశం చేసినట్లు సమాచారం. ప్రభుత్వం చేస్తున్న మంచి పనులను ప్రజలకు వివరించి చెప్పడానికి అంతా కృషి చేయాలని సూచించినట్లు తెలిసింది. గురువారం హైదరాబాద్‌లోని మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి కేంద్రంలో కాంగ్రెస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో సీఎల్పీ సమావేశం జరిగింది. మంత్రులు, ఎమ్మెల్యేలు, ఉప ముఖ్యమంత్రి, పీసీసీ అధ్యక్షుడు మాట్లాడిన తర్వాత చివర్లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మాట్లాడారు. సుమారు ఐదున్నర గంటల పాటు జరిగిన

తరువాయి 2లో



## ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు
# భారీ రాయితీలు



- **బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ, మహిళలకు ప్రోత్సాహం**
- **పెట్టుబడి రాయితీ 35% నుంచి 45% కు పెంపు**
- **రూ.50 కోట్ల నీరు-చెట్టు పెండింగ్ బకాయిల చెల్లింపు**
- **రూ.6,78,345 కోట్ల పెట్టుబడులు..**
- **4,28,705 మందికి ఉపాధి కల్పించే ఒప్పందాలకు మంత్రిమండలి ఆమోదం**

అమరావతి: రాష్ట్రంలో బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ, విభిన్న ప్రతిభావంతులు, మహిళా ఔత్సాహిక పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించే లక్ష్యంతో భారీగా పెంచిన రాయితీలకు మంత్రిమండలి ఆమోదం తెలిపింది. రాష్ట్ర సచివాలయంలో

తరువాయి 2లో

## అమెరికాతో రక్షణ బంధం మరింత బలోపేతం



2లో

## కుటుంబం, బుజ్జగింపులే
# కాంగ్రెస్‌కు ప్రాధాన్యం

- **మాకు మాత్రం దేశమే ముందు: మోదీ**

దిల్లీ: కాంగ్రెస్ పార్టీకి ఎంతసేపూ ఒక కుటుంబం, బుజ్జగింపు రాజకీయాలే ప్రాధాన్యమని, తమకు మాత్రం దేశమే ముందు అని ప్రధాని నరేంద్రమోదీ చెప్పారు. రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై రాజ్యసభలో జరిగిన చర్చకు గురువారం ఆయన సమాధానమిచ్చారు. అందరితో కలిసి.. అందరి వికాసానికి (సబ్‌కా సాథ్ సబ్‌కా వికాస్) అనే భావనను కాంగ్రెస్ నుంచి ఆశించడం

తరువాయి 2లో





## శాశ్వతం కాదు..
# తాత్కాలికమే

- **ట్రంప్ గాజా ప్రతిపాదనపై అమెరికా వివరణ**

న్యూయార్క్: పాలస్తీనావాసులు గాజాను వీడి ఈజిప్టు, జోర్డాన్‌లకు తరలివెళ్లాలని అధ్యక్షుడు ట్రంప్ చేసిన వ్యాఖ్యలపై అమెరికా వివరణ ఇచ్చింది. శాశ్వతంగా వెళ్లిపోవాలని తమ అధ్యక్షుడు పేర్కొనలేదని ఆ దేశ విదేశాంగమంత్రి మార్క్ రుబియో తెలిపారు. పునర్నిర్మాణం సాఫీగా సాగడానికి తాత్కాలికంగా తరలివెళ్లమని మాత్రమే ట్రంప్ సూచించారని అన్నారు. శ్వేతసౌధం ప్రతినిధి కారోలైన్ లెవెట్టి మాట్లాడుతూ.. ''పాలస్తీనా శరణార్థులకు మా మిత్రదేశాలైన ఈజిప్ట్, జోర్డాన్‌లు ఆశ్రయం ఇస్తాయని ఆశిస్తున్నాను. అప్పుడే వారి ఇళ్లను మేము పునర్‌నిర్మించగలం. ఈ విషయంలో ఇప్పటికే అధ్యక్షుడు ఓ స్పష్టతనిచ్చారు. వారిని తాత్కాలికంగా మాత్రమే గాజా నుంచి బయటకు తరలిస్తారు.'' అని ఆమె వెల్లడించారు. అమెరికా పర్యటనలో ఉన్న ఇజ్రాయెల్

తరువాయి 2లో

# 10-21 తేదీల మధ్య 30 రైళ్ల రద్దు

- **ఖమ్మం స్టేషన్ వద్ద పనులతో అంతరాయం**
- **జాబితాలో గోల్కొండ, భాగ్యనగర్, శాతవాహన..**

హైదరాబాద్: ఖమ్మం రైల్వే స్టేషన్ వద్ద నాన్ ఇంటర్‌లాకింగ్ పనుల నేపథ్యంలో 30 రైళ్లను వేర్వేరు తేదీల్లో రద్దు చేస్తున్నట్లు ద.మ.రైల్వే సీపీఆర్వో ఎ.శ్రీధర్ గురువారం ప్రకటించారు. కాజీపేట డోర్నకల్, డోర్నకల్‌విజయవాడ, భద్రాచలంరోడ్డువిజయవాడ ప్యాసింజర్ రైళ్లను ఈ నెల 10 నుంచి 20 వరకు రద్దు చేశారు. గోల్కొండ, భాగ్యనగర్, శాతవాహన సహా పలు ఎక్స్‌ప్రెస్‌లు వారం నుంచి 11 రోజుల పాటు ప్రయాణికులకు అందుబాటులో ఉండవు. 9 రైళ్లను దారి మళ్లించి నడపనున్నారు. నాలుగు రైళ్లు 6090 నిమిషాల ఆలస్యంగా బయల్దేరనున్నాయి.

తరువాయి 2లో



## బంగ్లాదేశ్‌లో
# మళ్లీ హింస..

- **అవామీలీగ్ నేతల ఇళ్లపై దాడులు**



2లో

# గీత దాటొద్దు..!

(మొదటిపేజీ తరువాయి)

ఈ సమావేశానికి మీడియాను అనుమతించలేదు. విశ్వసనీయవర్గాల సమాచారం ప్రకారం ముఖ్యమంత్రి ప్రసంగంలోని ముఖ్యాంశాలిలా ఉన్నాయి.

* **అందరికీ ఎల్లవేళలా అందుబాటులో ఉన్నాను**

"ఎవరికి ఏ సమస్య ఉన్నా చెప్పుకోవడానికి నేను ఎల్లవేళలా అందుబాటులో ఉన్నాను. నాతో చెప్పడం కుదరకపోతే పీసీసీ అధ్యక్షుడు, కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌ఛార్జికి లేదా ఏఐసీసీ పెద్దలకు.. ఇలా ఎవరికైనా చెప్పొచ్చు. ఇలా చెప్పుకోవాలనుకునేవారికి కావాలంటే నేనే అపాయింట్‌మెంట్ ఇప్పిస్తాను. పార్టీ సమావేశంలో అన్ని విషయాలు మాట్లాడవచ్చు. అంతే తప్ప బహిరంగంగా మాట్లాడటం, రహస్యంగా.. గ్రూపులుగా సమావేశం కావడం సరైన విధానం కాదు. మొదటిసారి ఎన్నికైన ఎమ్మెల్యేలు 70 శాతం వరకు ఉన్నారు. మొదటిసారి కంటే రెండోసారి గెలుపొందడం ముఖ్యం. రెండోసారి నెగ్గాలంటే ఎప్పుడూ జనంలో ఉండాలి తప్ప హైదరాబాద్‌లో కాదు. స్థానిక సంస్థల ఎన్నికలను ప్రతిష్ఠాత్మకంగా తీసుకొని పనిచేయండి. అత్యధిక స్థానాలు నెగ్గేందుకు పార్టీ శ్రేణులంతా కలసి పనిచేయాలి. ఎమ్మెల్యేలు క్షేత్రస్థాయిలో ఉండే కార్యకర్తలను కలుపుకొని పార్టీ విజయానికి కృషి చేయాలి. దశాబ్దాలుగా పెండింగ్‌లో ఉన్న ఎస్సీ వర్గీకరణ, కులగణనను విజయవంతంగా పూర్తి చేయడం లాంటి అంశాలతోపాటు కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన రైతు, సంక్షేమ పథకాలను విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలి.

* **ఎమ్మెల్యేలు బాగా పనిచేస్తే ప్రభుత్వానికి మంచి పేరు**

రాజకీయాల్లో అనేక అంశాలు ముడిపడి ఉంటాయి. వాటిని అర్థం చేసుకోకుండా బహిరంగంగా ఏమైనా మాట్లాడితే ప్రజల్లోకి తప్పుడు సంకేతాలు వెళ్తాయి. ఏమైనా ఉంటే వ్యక్తిగతంగా చెప్పుకోవాలి. ముగ్గురు, నలుగురు ఎమ్మెల్యేలు విందు పేరుతో కలిశారు. కానీ, ఏదో మాట్లాడుకున్నట్లు బయటకు వచ్చింది. ఇలాంటి వాటివల్ల మీరు మునగడమే కాదు.. పార్టీకీ నష్టమన్న విషయాన్ని గుర్తుపెట్టుకోండి. మీరు అడిగే వాటిలో కొన్ని చేయగలిగేవి ఉంటాయి. కొన్ని చేయలేనివి ఉంటాయి. సొంతమా.. ప్రజలకు సంబంధించినవా? ఇలా అన్ని అంశాలను పరిగణనలోకి తీసుకోవాల్సి ఉంటుంది. ఎమ్మెల్యేలు ఎంత బాగా పనిచేస్తే ప్రభుత్వానికి అంత మంచి పేరు వస్తుంది. ప్రభుత్వం చేసే మంచి పనులు, పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన బాధ్యత ఎమ్మెల్యేలదే. ఆర్థికంగా ఎన్నో ఇబ్బందులున్నా ఏడాది పాలనలో చాలా పనులు చేశాం. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేస్తున్నాం. రుణమాఫీ, రైతుభరోసా, ఉచిత కరెంటు, ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం వంటి హామీలన్నీ అమలు చేస్తున్నాం. మనం చేసిన పనుల్ని కూడా చేయలేదని ప్రతిపక్షాలు ప్రచారం చేస్తున్నాయి. వాటిని గట్టిగా తిప్పికొట్టాలి. గతంలో కులగణన, వర్గీకరణ ఎవరూ చేయలేకపోయారు. ఎస్సీ వర్గీకరణ చేస్తామని గత పాలకులు ఎన్నో మాటలు మాట్లాడారు. బడుగు, బలహీనవర్గాల జనాభా ఎంతో చెప్పాలని, తమకు న్యాయం చేయాలని బీసీలు; వర్గీకరణ చేయాలని ఎస్సీ వర్గాలు దశాబ్దాలుగా పోరాడుతున్నా దేశంలో ఎవరూ చేయలేకపోయారు. కానీ, మన ప్రభుత్వం చేసి చూపించింది. గత పదేళ్లలో ఎమ్మెల్యేలు నోరువిప్పి మాట్లాడే పరిస్థితి లేదు. భారాస హయాంలో మంత్రులు చెప్పినా విన్న పాపానా పోలేదు. అలాంటి ప్రభుత్వాన్ని కాదని కాంగ్రెస్‌కు ప్రజలు అవకాశం ఇచ్చారు. ఇప్పుడు స్వేచ్ఛగా పనిచేసే అవకాశంతో ప్రజలకు వద్దకు పాలన తెచ్చాం. ప్రభుత్వాన్ని కాపాడుకునే బాధ్యతను అందరూ తీసుకుని ఆలోచించి వ్యవహరించాలి. పార్టీ నేతలే కాకుండా సామాన్య ప్రజలను సైతం నిత్యం నేను కలుస్తుంటాను. నాకు ఎవరైనా, ఏమైనా చెప్పే అవకాశం ఉంది" అని సీఎం చెప్పినట్లు సమాచారం.

# ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు భారీ రాయితీలు

(మొదటిపేజీ తరువాయి)

ముఖ్యమంత్రి అధ్యక్షతన గురువారం నిర్వహించిన మంత్రిమండలి సమావేశం.. పలు కీలక నిర్ణయాలు తీసుకుంది. ప్రస్తుతం బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ, విభిన్న ప్రతిభావంతులు, మహిళా ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు 35%గా ఉన్న పెట్టుబడి రాయితీని 45%కు పెంచుతూ నిర్ణయం తీసుకుంది. ఇప్పటివరకు ఉత్పత్తి కార్యకలాపాలకు ఈ పెట్టుబడి రాయితీ ఇస్తుండగా.. ఇకపై రవాణా, లాజిస్టిక్స్‌కు సైతం 45% రాయితీ లేదా గరిష్ఠంగా రూ.75లక్షల వరకు ఇవ్వాలని నిర్ణయించింది. కొత్తగా పెట్టుబడులు పెట్టేవారికే ఈ రాయితీలు వర్తిస్తాయి. ఎస్సీ, ఎస్టీ పారిశ్రామికవేత్తలకు ఇంతకుముందు భూమి విలువపై 50% రాయితీ.. గరిష్ఠంగా రూ.2 లక్షలు ఇస్తుండగా.. దీన్ని 75%, గరిష్ఠంగా రూ.25 లక్షలకు పెంచే ప్రతిపాదనలను మంత్రిమండలి ఆమోదించింది. మంత్రిమండలిలో తీసుకున్న నిర్ణయాలను సమాచార, పౌరసంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారధి మీడియాకు వెల్లడించారు. ఎంఎస్ఎంఈడీపీ4.0 పాలసీలో మహిళలు, బీసీలు, విభిన్న ప్రతిభావంతులకు ఆరేళ్లపాటు విద్యుత్తు రాయితీగా ప్రతి యూనిట్‌కు రూపాయి, ఎస్సీ, ఎస్టీలకు యూనిట్‌కు రూ.1.50 చొప్పున ఐదేళ్లపాటు ఇస్తుండగా.. అన్నివర్గాల మహిళలు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, విభిన్న ప్రతిభావంతులకు విద్యుత్తు రాయితీని యూనిట్‌కు రూ.1.50 చొప్పున ఐదేళ్లపాటు ఇవ్వాలని నిర్ణయించింది. రాష్ట్ర జీఎస్టీ రీయింబర్స్‌మెంట్ ప్రోత్సాహాన్ని ఐదేళ్లపాటు ఇస్తారు.

* **నీరు-చెట్టు పెండింగ్ బిల్లులకు మోక్షం**

201419 తెదేపా ప్రభుత్వహయాంలో నీరుచెట్టు కింద చేసిన పనుల పెండింగ్ బిల్లుల చెల్లింపు, విజిలెన్స్ కేసులు, ఇంజినీర్లపై తీసుకున్న క్రమశిక్షణ చర్యలను ఉపసంహరించుకునేందుకు చేసిన ప్రతిపాదనలకు మంత్రిమండలి ఆమోదం తెలిపింది. జగన్ ప్రభుత్వం రాజకీయ దురుద్దేశంతో పనులు చేసిన కాంట్రాక్టర్లపై విజిలెన్స్ కేసులు పెట్టి, వారికి బిల్లులు చెల్లించకుండా వేధించింది. ఈ పనులు చేసిన 61మంది కాంట్రాక్టర్లు చనిపోయారు. పలు కారణాలతో ఆగిపోయిన రూ.50.56 కోట్లు చెల్లిస్తారు. రిజిస్ట్రేషన్, స్టాంపుల విభాగంలో డైనమిక్ క్యూ మేనేజ్‌మెంట్ సిస్టమ్ ప్రవేశపెట్టేందుకు చేసిన ప్రతిపాదనకు మంత్రిమండలి ఆమోదం తెలిపింది. రిజిస్ట్రేషన్ కార్యాలయాల్లో రద్దీని తగ్గించేందుకు ఈ విధానం తీసుకొచ్చారు. ఏపీసీఆర్‌డీఏ పరిధిలోని దాదాపు రూ.3040వేల కోట్లు, జల్‌జీవన్ మిషన్ రూ.5060వేల కోట్లు, అమృత్, జలవనరులశాఖల్లో రూ.వేలకోట్ల విలువ చేసే పనులను ప్రభుత్వం ప్రారంభించింది. ఇవి చేసేందుకు ప్రీ క్వాలిఫికేషన్ ఉన్న కాంట్రాక్టర్లు లభ్యం కావడం కష్టమని బిడ్ సామర్థ్యంలో మార్పులకు ఆమోదం. ఈ నియమం అన్ని శాఖలకూ వర్తించేలా నిర్ణయం.

* **4.28 లక్షల ఉద్యోగాలు**

రాష్ట్రంలో ఇప్పటివరకు 34 ప్రాజెక్టులకు రూ.6,78,345 కోట్ల పెట్టుబడులు పెట్టేందుకు ప్రభుత్వం ఒప్పందాలు కుదుర్చుకుంది. వీటిద్వారా 4,28,705 మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభించనున్నాయి. 202429 కాలానికి రూపొందించిన పలు పాలసీలు ఎంఎస్ఎంఈ, ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ డెవలప్‌మెంట్, ఏపీ ఫుడ్ ప్రాసెసింగ్, ఏపీ సస్టైనబుల్ ఎలక్ట్రిక్ మొబిలిటీ, ఏపీ టెక్స్‌టైల్స్, అపెరల్, గార్మెంట్స్ పాలసీలకు సవరణలకు ఆమోదం.

కోరమండల్ ఇంటర్నేషనల్ లిమిటెడ్ అభ్యర్థన మేరకు పెట్టుబడి రాయితీ 30%, రీకార్బొనైజేషన్‌కు 25%, విద్యుత్తు రాయితీ ప్రతి యూనిట్‌కు రూ.2చొప్పున పదేళ్లపాటు ఏడాదికి గరిష్ఠంగా 3.50కోట్ల యూనిట్లు, వేతనాల వ్యయంపై 20% రాయితీ ఇవ్వాలని నిర్ణయం. కోరమండల్ కంపెనీ ద్వారా రాష్ట్రానికి రూ.1,539 కోట్ల పెట్టుబడులు, 750 మందికి ఉద్యోగావకాశాలు రానున్నాయి. ఎలీప్‌కు ఇంతకుముందు తూర్పుగోదావరి జిల్లాలోని బలభద్రపురంలో 34.19 ఎకరాలు కేటాయించగా.. ఇప్పుడు ఆ భూమికి బదులు అనకాపల్లి జిల్లా కోడూరులో 31.77 ఎకరాల కేటాయింపు. దీంతో రూ.305 కోట్ల పెట్టుబడులు, ఆరువేల మందికి ఉపాధి లభిస్తుంది.

* **రైతులకు ఎక్స్‌గ్రేషియా**

చెన్నైబెంగళూరు పారిశ్రామిక కారిడార్‌లో తిరుపతి జిల్లా చిల్లకూరు మండలం తమ్మినపట్నం గ్రామం, కోట మండలం కొత్తపట్నంలో ఆక్రమణలో ఉన్న రైతులకు కొన్ని షరతులతో ఎకరానికి రూ.8లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియా ఇచ్చేందుకు నిర్ణయం. తితిదేలో 15 పోటు వర్కర్స్ పోస్టులను సూపర్‌వైజర్లుగా.. సీనియర్ అసిస్టెంట్ కేడర్‌కు సమానంగా పెంచేందుకు ఆమోదం. ఉమ్మడి ఏపీలోని మానవవనరుల అభివృద్ధి కేంద్రం తరహాలో కేంద్రప్రభుత్వ విధానాలకు తగ్గట్లుగా రాజధాని అమరావతిలో సెంటర్‌ను అభివృద్ధి చేయాలని నిర్ణయం. అనంతపురంలోని కస్టమ్స్ శిక్షణ కేంద్రంలో కల్పించిన వసతులను మంత్రుల కమిటీ పరిశీలించి, అమరావతిలో నిర్మించే కేంద్రంలోనూ అలాంటి ఉండేలా చూస్తుంది.

**సౌర విద్యుత్తుకు కేటాయింపులు**

దాదాపు 3,200 మెగావాట్ల సౌరవిద్యుత్తు సామర్థ్యం కేటాయించాలని పలు కంపెనీలు ప్రభుత్వాన్ని కోరాయి. ఈ ప్రాజెక్టుల ద్వారా రూ.5,500 కోట్ల పెట్టుబడులు, 3,500 మందికి ఉద్యోగాలు లభించనున్నాయి. టాటా పవర్ రెన్యూవబుల్ ఎనర్జీ లిమిటెడ్‌కు అనంతపురం జిల్లా గంగవరంలో 400 మెగావాట్ల సౌర విద్యుత్తు, సయేల్ సోలార్ ఎంహెచ్‌పీ2 ప్రైవేట్ లిమిటెడ్‌కు అనంతపురం జిల్లా బోడయపల్లి గ్రామం, వైఎస్సార్ జిల్లా కోడూరులో 300 మెగావాట్ల సామర్థ్యం కేటాయింపునకు అనుమతి. అనంతపురం రెన్యూవబుల్, కడప రెన్యూవబువల్, ఆస్పారీ రెన్యూవబుల్ విద్యుత్తు ప్రాజెక్టుల కేటాయింపు కోసం ఎకోరెన్ ఎనర్జీ ఇండియా చేసిన అభ్యర్థనకు ఆమోదం. వైఎస్సార్ జిల్లా గోవిందపల్లి దిగువ గ్రామాలు, నంద్యాల జిల్లా మాయలూరులో ఉన్న ప్రభుత్వ భూములను లీజు ప్రాతిపదికన సయేల్ సోలార్ ఎంహెచ్‌పీ2 ప్రైవేటు లిమిటెడ్‌కు కేటాయింపు. అన్నమయ్య జిల్లా చింతలకుంట సమీపంలో 2వేల మెగావాట్ల కొమ్మూరు పీఎస్‌పీ ప్రాజెక్టు నెలకొల్పేందుకు మేఘా ఇంజినీరింగ్ చేసిన ప్రతిపాదనకు ఆమోదం. అల్లూరి సీతారామరాజు జిల్లా గుజ్జిలిలో 1500 మెగావాట్లు, చిట్టంవలసలో 800 మెగావాట్ల పంప్‌డ్ స్టోరేజీ ప్రాజెక్టుల కోసం నవయుగ ఇంజినీరింగ్ కంపెనీ చేసిన అభ్యర్థనకు మంత్రిమండలి ఆమోదం తెలిపింది.

# శాశ్వతం కాదు.. తాత్కాలికమే

ప్రధాని బెంజమిన్ నెతన్యాహు మంగళవారం ట్రంప్‌తో భేటీ అయ్యారు. "ట్రంప్ ఆలోచనలో తప్పేమీ లేదు. ఒకవేళ గాజావాసులు ఆ ప్రాంతాన్ని విడిచివెళ్లిపోవాలని నిర్ణయించుకుంటే అలాగే చేయవచ్చు. లేదా అక్కడే ఉండాలని అనుకుంటే ఉండొచ్చు. ఏదేమైనా గాజాను పునర్నిర్మించాలి" అని ఓ అంతర్జాతీయ మీడియా సంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో నెతన్యాహు పేర్కొన్నారు.

**బహుమతిగా బంగారు పేజర్**

అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌నకు ఇజ్రాయెల్ ప్రధాని ఓ బంగారు పేజర్‌ను బహుమతిగా ఇచ్చారు. గతేడాది హెజ్‌బొల్లా శ్రేణులపై ఇజ్రాయెల్ పేజర్ దాడులకు పాల్పడిన సంగతి తెలిసిందే. బంగారు పేజర్‌తో పాటు సాధారణ పేజర్ సైతం నెతన్యాహు కానుకగా ఇచ్చారు. వీటిని స్వీకరించిన ట్రంప్ నాడు ఇజ్రాయెల్ నిర్వహించిన ఆపరేషన్ గొప్పదిగా వ్యాఖ్యానించినట్లు తెలుస్తోంది. గతేడాది సెప్టెంబరు 17న లెబనాన్, సిరియాల్లో వందల సంఖ్యలో పేజర్లు పేలాయి. ఆ ఘటనలో 40 మంది చనిపోగా.. దాదాపు 3 వేల మంది గాయాలపాలయ్యారు.

* **అమెరికా బాటలోనే ఇజ్రాయెల్ ఐరాస మానవ హక్కుల మండలికి గుడ్‌బై**

టెల్ అవీవ్: ఐక్యరాజ్యసమితి మానవ హక్కుల మండలి (యూఎన్‌హెచ్ఆర్సీ) నుంచి వైదొలగుతున్నట్లు ఇజ్రాయెల్ గురువారం ప్రకటించింది. ఈ విషయంలో తాము ట్రంప్ ప్రభుత్వ బాటలోనే నడుస్తామని తెలిపింది. యూఎన్‌హెచ్ఆర్సీ నుంచి తప్పుకొంటున్నట్లు మంగళవారం అమెరికా ప్రకటించిన సంగతి తెలిసిందే. "మండలిలో మాకు వ్యతిరేకంగా కొనసాగుతున్న, ఎడతెగని వ్యవస్థాగత పక్షపాతాన్ని దృష్టిలో ఉంచుకొని ఈ నిర్ణయం తీసుకున్నాం. మండలి ఆవిర్భవించిన 2006 నుంచి ఇది మొదలైంది" అని ఇజ్రాయెల్ విదేశాంగ మంత్రి గిడెన్ సార్... మానవహక్కుల మండలికి రాసిన లేఖలో పేర్కొన్నారు., హక్కులను ఉల్లంఘిస్తున్న వారిని యూఎన్‌హెచ్ఆర్సీ కాపాడుతూ.. మధ్యాసియాలో ఒకే ఒక్క ప్రజాస్వామిక దేశమైన ఇజ్రాయెల్‌ను లక్ష్యంగా చేసుకుందని లేఖలో ఆరోపించారు.

# మహా కుంభమేళా నుంచి.. అఖాడా సాధువుల తిరుగుముఖం

మహాకుంభ్ నగర్ (యూపీ): ప్రయాగ్‌రాజ్‌లోని త్రివేణీసంగమంలో జనవరి 13 నుంచి కొనసాగుతున్న మహా కుంభమేళా అధికారికంగా ఫిబ్రవరి 26న ముగియనుండగా, ఈ మేళాకు ఆధ్యాత్మిక పరిమళాన్ని అద్దిన 13 అఖాడాల సాధువులు క్రమంగా తిరుగుముఖం పడుతున్నారు. దీనికి సూచికగా ఆయా అఖాడాల ధర్మ ధ్వజాలను వారు అవనతం చేశారు. గత సోమవారం నాటి వసంత పంచమితో తుది అమృతస్నానం ముగిసినందున సంప్రదాయబద్ధమైన కఢీ పకోడా విందుతో సాధువులు తమ స్థావరాలకు తిరుగుపయనం అవుతున్నారు. వీరిలో పలువురు మార్గమధ్యంలో కాశీ, అయోధ్య, బృందావన్, ఆనంద్‌పుర్ సాహిబ్‌లను సందర్శించి పూజలు చేయనున్నారు. కుంభమేళాలో వసంత పంచమి ముగిశాక వచ్చే మాఘ పూర్ణిమ, మహా శివరాత్రి సాధారణ భక్తుల కోసం మాత్రమేనని జునా అఖాడా అంతర్జాతీయ అధికార ప్రతినిధి శ్రీ మహంత్ నారాయణ్ గిరి తెలిపారు. యూపీ ప్రభుత్వ అంచనాల ప్రకారం.. గురువారం నాటికి 39 కోట్లమంది భక్తులు కుంభమేళాను సందర్శించారు.

**మణిపూర్, హరియాణా సీఎంల పుణ్యస్నానం**

మణిపూర్ ముఖ్యమంత్రి ఎన్. బీరేన్‌సింగ్ తన కేబినెట్‌లోని ముగ్గురు మంత్రులు, నలుగురు భాజపా ఎమ్మెల్యేలతో కలిసి గురువారం త్రివేణీసంగమంలో పుణ్యస్నానం చేశారు. దేశంతోపాటు మణిపూర్ ప్రజల శాంతి, పురోగతి కోసం ప్రార్థించినట్లు బీరేన్‌సింగ్ 'ఎక్స్' ద్వారా వెల్లడించారు.

## భువన్ సర్వే మళ్లీ మొదలు..

(మొదటిపేజీ తరువాయి)

భావిస్తున్నారు. దీనికి తగ్గ ఏర్పాట్లు చేస్తున్నారు. రానున్న నాలుగైదు నెలల్లో సర్వే పూర్తిచేసి ఆస్తిపన్ను మదింపు చేయాలని తలపెట్టారు. ఈ కార్యక్రమం వల్ల ప్రజలకు కూడా మేలు జరుగుతుందని, తమ ఆస్తికి సంబంధించి కచ్చితంగా పన్ను చెల్లించే వెసులుబాటు ఉంటుందని అధికారులు చెబుతున్నారు. అన్నింటికీ మించి అవకతవకలను నిరోధించడం ద్వారా ఆస్తిపన్ను వసూళ్లు పెంచవచ్చన్న ఉద్దేశంతోనే ఈ కార్యక్రమం చేపట్టారు. సర్వే విజయవంతంగా పూర్తయితే ఆయా పట్టణ స్థానిక సంస్థల్లో రోడ్లు, డ్రైనేజీలు వంటివాటిని కూడా మెరుగుపరిచే అవకాశం ఉంటుంది.

## 1021 తేదీల మధ్య 30 రైళ్ల రద్దు

(మొదటిపేజీ తరువాయి)

రద్దయిన రైళ్లు.. తేదీలు: సికింద్రాబాద్‌గుంటూరు (17201/17202) గోల్కొండ ఎక్స్‌ప్రెస్: 11 నుంచి 21 వరకు

సికింద్రాబాద్‌సిర్పూర్ కాగజ్‌నగర్ (17233/17234) భాగ్యనగర్ ఎక్స్‌ప్రెస్: 10 నుంచి 21 వరకు

గుంటూరుసికింద్రాబాద్ (12705/12706) ఇంటర్‌సిటీ ఎక్స్‌ప్రెస్: 10, 11, 15, 18, 19, 20

విజయవాడసికింద్రాబాద్ (12713/12714) శాతవాహన ఎక్స్‌ప్రెస్: 11, 14, 16, 18, 19, 20

రద్దయిన జాబితాలో మరికొన్ని రైళ్లు ఉన్నాయి.

సికింద్రాబాద్‌విశాఖపట్నం (20834) వందేభారత్ ఎక్స్‌ప్రెస్ 19, 20 తేదీల్లో 75 నిమిషాలు ఆలస్యంగా, ఆదిలాబాద్‌తిరుపతి (17406) కృష్ణా ఎక్స్‌ప్రెస్ 9, 11, 14, 18, 19 తేదీల్లో 90 నిమిషాలు ఆలస్యంగా బయల్దేరుతాయి.

## అమెరికాతో రక్షణ బంధం మరింత బలోపేతం

* **పదేళ్ల సమగ్ర ఫ్రేమ్‌వర్క్‌తో పనిచేయాలని నిర్ణయం**

దిల్లీ: ద్వైపాక్షిక రక్షణ భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేసుకునేందుకు పదేళ్ల సమగ్ర ఫ్రేమ్‌వర్క్‌తో పనిచేయాలని భారత్, అమెరికా నిర్ణయించుకున్నాయి. రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, అమెరికా రక్షణ మంత్రి పీట్ హెగ్సెత్ మధ్య గురువారం జరిగిన ఫోన్ సంభాషణలో ఈ మేరకు అంగీకారం కుదిరింది. గూఢచర్యం, వ్యూహరచన, పారిశ్రామిక సహా పలు రంగాల్లో పరస్పరం సహకరించుకోవాలని ఇరు దేశాలు తీర్మానించుకున్నాయి. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ త్వరలో అమెరికా పర్యటనకు వెళ్లనున్న నేపథ్యంలో ఈ పరిణామం చోటుచేసుకోవడం గమనార్హం. ద్వైపాక్షిక రక్షణ సంబంధాలకు సంబంధించిన అన్ని విషయాలనూ.. అద్భుతంగా సాగిన తమ సంభాషణలో సమీక్షించామని రాజ్‌నాథ్ సింగ్ 'ఎక్స్'లో పేర్కొన్నారు. అమెరికా రక్షణ మంత్రిగా హెగ్సెత్ పదవీ బాధ్యతలు స్వీకరించాక రాజ్‌నాథ్‌తో సంభాషించడం ఇదే తొలిసారి.

* **పినాక రాకెట్ వ్యవస్థ కోసం రూ.10 వేల కోట్ల ఒప్పందాలు**

పినాక బహుళ రాకెట్ ప్రయోగ వ్యవస్థకు సంబంధించి రక్షణ శాఖ రూ.10 వేల కోట్ల విలువైన ఒప్పందాలపై గురువారం సంతకాలు చేసింది. మల్టీ బ్యారెల్ రాకెట్ వ్యవస్థలో ఉపయోగించే మందుగుండు సామగ్రి అయిన ఒకటో టైపు ఏరియా డినయల్ మ్యూనిషన్ కొనుగోలుతోపాటు అధిక పేలుడు సామర్థ్యం కలిగివుండి ఎక్కువ దూరం ప్రయాణించే రాకెట్ల సేకరణ ఈ కాంట్రాక్టులో భాగం. దీంతోపాటు శక్తి సాఫ్ట్‌వేర్ మెరుగుదలకై రక్షణ శాఖ భారత్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్‌తో ఒప్పందం కుదుర్చుకుందని ఒక అధికారిక ప్రకటన తెలిపింది. రక్షణ శాఖ కార్యదర్శి రాజేశ్ కుమార్ సింగ్ సమక్షంలో ఈ ఒప్పందాలపై సంతకాలు జరిగాయి. ఇవి దేశ సైనిక శక్తిని పెంపొందిస్తాయని అధికార వర్గాలు తెలిపాయి.

## కుటుంబం, బుజ్జగింపులే కాంగ్రెస్‌కు ప్రాధాన్యం

(మొదటిపేజీ తరువాయి)

తప్పే అవుతుందని విమర్శించారు. ప్రభుత్వంపై విపక్ష విమర్శలు ప్రజాస్వామ్యంలో సహజమే అయినా అభివృద్ధి ప్రస్థానానికి ఆటంకం కలిగించేలా అవి ఉండరాదని చెప్పారు. అదీ కాంగ్రెస్ నమూనా: "ప్రజలు మమ్మల్ని మూడుసార్లు విశ్వసించారు. కాంగ్రెస్ మోడల్ అంటే అబద్ధాలు, మోసం, ఓట్లకోసం చేసే బుజ్జగింపులు, పక్షపాతాల కలయిక. కొందరినే బుజ్జగించడం కాదు.. అందరినీ సంతృప్తి పరచాలనే మా నమూనాకు 2014 తర్వాత ప్రజలు మద్దతిచ్చారు. పేదల అభ్యున్నతి, మధ్యతరగతికి బాసటగా నిల్చోవడం కోసం మేం పాటు పడుతున్నాం. మా ఆలోచన ఎప్పుడూ దేశ ప్రగతి గురించే ఉంటుంది. ఎస్సీ, ఎస్టీ, బీసీలకు నష్టం లేకుండా ఆర్థికంగా వెనకబడిన వర్గాల వారికోసం 10% రిజర్వేషన్ తెచ్చాం. పేదలు, బడుగు బలహీన వర్గాల సంక్షేమం మా ప్రాధాన్యం' అని ప్రధాని పేర్కొన్నారు.

## బంగ్లాదేశ్‌లో మళ్లీ హింస

ఢాకా/దిల్లీ: బంగ్లాదేశ్‌లో మరోసారి హింసాత్మక ఘటనలు చెలరేగాయి. ప్రధాని పదవి నుంచి వైదొలగి భారత్‌లో ఆశ్రయం పొందుతున్న షేక్ హసీనా అనుయాయులైన అవామీలీగ్ పార్టీ నేతల ఇళ్లే లక్ష్యంగా నిరసనకారులు దాడులకు దిగారు. మ్యూజియంగా మార్చిన బంగ్లాదేశ్ వ్యవస్థాపక నేత, 'బంగబంధు' షేక్ ముజిబుర్ రెహమాన్ స్మారక నివాసంపై దాడి చేసి నిప్పంటించారు. బుధవారం రాత్రి మొదలైన ఈ విధ్వంసం గురువారం కూడా కొనసాగింది. మాజీ ప్రధాని షేక్ హసీనా బుధవారం సామాజిక మాధ్యమం వేదికగా ప్రసంగిస్తూ మహమ్మద్ యూనస్ సారథ్యంలోని మధ్యంతర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిరసనలు తెలపాలని అవామీలీగ్ నేతలకు పిలుపునిచ్చారు. దీంతో రెచ్చిపోయిన ఆమె వ్యతిరేకులు ఢాకాలోని ముజిబుర్ రెహమాన్ స్మారక నివాసం ఎదుట రాత్రికి రాత్రి ర్యాలీ నిర్వహించి ఆయన కుడ్యచిత్రాలను ధ్వంసం చేశారు. ఇంటికి నిప్పంటించారు. బంగ్లాదేశ్‌వ్యాప్తంగా పలుచోట్ల అవామీలీగ్ నేతల ఇళ్లపై దాడులు జరిగాయి. షేక్ హసీనా ఢాకాకు వ్యతిరేకంగా చేస్తున్న తప్పుడు, కల్పిత వ్యాఖ్యలను 'శత్రుచర్య'గా పరిగణిస్తున్నట్లు బంగ్లాదేశ్ గురువారం పేర్కొంది. ఈ మేరకు ఢాకాలోని భారత డిప్యూటీ హై కమిషనర్‌కు నిరసన తెలిపింది. తన తండ్రి స్మారక నివాసాన్ని ధ్వంసం చేయడంపై హసీనా ఆగ్రహం వ్యక్తం చేశారు. "వారు భవనాన్ని కూల్చివేయవచ్చు, చరిత్రను కాదు. చరిత్ర ప్రతీకారం తీర్చుకొంటుందన్న విషయాన్ని కూడా వారు గుర్తుంచుకోవాలి" అని వ్యాఖ్యానించారు. ముజిబుర్ రెహమాన్ స్మారక నివాసంపై దాడిని భారత్ తీవ్రంగా ఖండించింది.



# ప్యారనగర్ లో డంపింగ్ యార్డ్ వద్దు

* కలెక్టరేట్ ఎదుట గ్రామస్తుల ధర్నా...







సంగారెడ్డి,ప్రజాస్ఫూర్తి 06: గుమ్మడిదల మండలం ప్యారా నగర్ లో సర్వేనెంబర్ 40,41లో జీహెచ్ఎంసీ నిర్మిస్తున్న డంపింగ్ యార్డును ఆపివేయాలని గ్రామ ప్రజలు ఆందోళన చేస్తుంటే వందలాది పోలీసులతో గ్రామాన్నిదిగ్బంధనం చేసి ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్నారని, ప్యారా నగర్ ను మరో లగచర్ల చేస్తారా అంటూ నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతా లక్ష్మారెడ్డి ఆరోపించారు. గురువారం బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు చింతా ప్రభాకర్ ఆధ్వర్యంలో కలెక్టర్ వల్లూరు క్రాంతికి వినతిపత్రం అందజేశారు. అనంతరం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సునీతా లక్ష్మారెడ్డి మాట్లాడుతు పచ్చని ప్రకృతి అడవి మధ్యలో ఉన్న ప్యారా నగర్ లోజీహెచ్ఎంసీ 151 ఎకరాలలో డంపింగ్ యార్డు నిర్మించడం అంటే ప్రకృతిని ధ్వంసం చేయడమే అని ఆరోపించారు. రాత్రికి రాత్రి రైతులకు సమాచారం ఇవ్వకుండా వందలాది మంది పోలీసు బలగాలతో గ్రామంలో ప్రవేశించిన వందలాది లారీలతో డంపింగ్ యార్డు నిర్మాణానికి రావడం పోలీసులు పహారా కావడంతో ఆ గ్రామ ప్రజలు తీవ్ర భయాందోళనలతో

గడిపారన్నారు. ఈ సమావేశంలో సంగారెడ్డి ఎమ్మెల్యే చింతా ప్రభాకర్, మాజీ సీడీసీ చైర్మన్ కాసాల బుచ్చిరెడ్డి, గుమ్మడిదల బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు కొత్తపల్లి ప్రభాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# వార్డు కార్యాలయాన్ని సందర్శించిన బీఆర్ఎస్ నేత



కూకట్ పల్లి, (ప్రజాస్ఫూర్తి ) : ఆల్విన్ కాలనీ డివిజన్ పరిధిలోని వార్డు కార్యాలయాన్ని గురువారం బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు ఎర్రబెల్లి సతీష్ రావు సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా ఇందిరమ్మ ఇళ్ల కోసం ధరఖాస్తు చేసుకున్న ప్రజలను వివరాలు అడిగి తెలుసుకున్నారు.

# లిబియా నుండి స్వదేశానికి చేరిన 18 మంది భారతీయ పౌరులు..




హైదరాబాద్, ప్రజాస్ఫూర్తి : లిబియాలోని బెంఘాజీలో చిక్కుకున్న 18 మంది భారతీయ పౌరులను లిబియాలోని భారత రాయబార కార్యాలయం సమిష్టి ప్రయత్నాల ద్వారా విజయవంతంగా స్వదేశానికి తీసుకువచ్చారు. భద్రతా సమస్యల కారణంగా ఈ వ్యక్తులు అనేక వారాలుగా దేశంలోనే చిక్కుకున్నారు. విదేశాంగ మంత్రిత్వ శాఖ ప్రతినిధి రణధీర్ జైస్వాల్, ఎక్స్ (గతంలో ట్విట్టర్)లో ఒక పోస్ట్‌లో ఈ పరిణామాన్ని ధృవీకరించారు. "లిబియాలోని బెంఘాజీ నుండి 18 మంది భారతీయ పౌరులు తిరిగి రావడానికి లిబియాలోని భారత రాయబార కార్యాలయం దోహదపడిందని పేర్కొన్నారు. కార్మికుల భద్రతను నిర్ధారించడానికి భారత రాయబార కార్యాలయం స్థానిక లిబియా అధికారులతో కలిసి పనిచేసిందని, అవసరమైన ప్రయాణ పత్రాలు అధికారాలను పొందడంలో వారికి సహాయం చేసిందని ఆయన పేర్కొన్నారు.ఉపాధి అవకాశాలను హామీ ఇచ్చి చిక్కుకున్న వ్యక్తులు లిబియాకు ప్రయాణించారు, కానీ తరువాత వారు క్లిష్ట పరిస్థితుల్లో చిక్కుకున్నారు. వారి కేసులను నిశితంగా పర్యవేక్షిస్తున్నామని మరియు సజావుగా స్వదేశానికి తిరిగి పంపే ప్రక్రియను నిర్ధారించడానికి రాయబార కార్యాలయం నిరంతరం సంప్రదింపులు జరుపుతుందని ఏంఈఏ హామీ ఇచ్చింది. ముఖ్యంగా, అదే బృందం నుండి ముగ్గురు వ్యక్తులు అక్టోబర్ ప్రారంభంలోనే భారతదేశానికి తిరిగి వచ్చారు. లిబియా అధికారుల వేగవంతమైన ప్రతిస్పందన మరియు సహకారానికి కృతజ్ఞతలు తెలుపుతూ, జైస్వాల్, "లిబియా అధికారుల మద్దతు సహకారానికి ధన్యవాదాలు తెలిపారు. విదేశాలలో ఉన్న భారతీయులందరి భద్రత, సంక్షేమాన్ని నిర్ధారించడంలో భారత ప్రభుత్వం నిబద్ధతను కూడా ఆయన పునరుద్ఘాటించారు.

# ఘనంగా ప్రారంభమైన జిల్లా పోలీస్ యాన్యువల్ స్పోర్ట్స్ మీట్2025

* క్రీడలు మానసిక ఉల్లాసానికి తోడ్పడతాయి
* జిల్లా ఎస్పీ రోహిత్ రాజు









ప్రజా స్ఫూర్తి,భద్రాద్రి కొత్తగూడెం: జిల్లా పోలీసు హెడ్ క్వార్టర్స్ అయిన హేమచంద్రపురం నందు గల పెరేడ్ మైదానం , క్రీడా మైదానం లో గురువారం జిల్లా పోలీసుల యాన్యువల్ స్పోర్ట్స్ మీట్ 2025 ప్రారంభోత్సవ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు.జిల్లా ఎస్పీ రోహిత్ రాజు ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొని జిల్లా పోలీస్ శాఖలోని విభాగాల వారీగా చేసిన అద్భుతమైన పెరేడ్ ను తిలకించారు. అనంతరం యానిమల్ స్పోర్ట్స్ మీట్ ఫ్లాగ్ ను ఎస్పీ ఆవిష్కరించారు.భద్రాచలం ఏఎస్పి విక్రాంత్ కుమార్ సింగ్ ముఖ్య అతిథి అయిన ఎస్పీ ని స్పోర్ట్స్ మీట్ ను ప్రారంభించాలని విజ్ఞప్తి చేసిన తర్వాత ఎస్పీ జిల్లా యాన్యువల్ స్పోర్ట్స్ మీట్ ను ప్రారంభించారు. అనంతరం ఈ ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని ఉద్దేశించి ఎస్పీ మాట్లాడుతూ జిల్లా పోలీస్ శాఖలో పనిచేసే పోలీస్ అధికారులు , సిబ్బంది నిత్యం తమ విధులను సమర్థవంతంగా నిర్వర్తిస్తున్నారని అన్నారు.విధుల నిర్వహణలో భాగంగా నిరంతరం ప్రజలకు సేవలు అందిస్తున్న పోలీసు అధికారులు,సిబ్బందికి ఆటవిడుపు, మానసికొల్లాసం కొరకు ఈ క్రీడలను నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. మూడు రోజుల పాటు జరగనున్న ఈ క్రీడలలో ఆసక్తిగల పోలీస్ అధికారులు , సిబ్బంది పాల్గొంటారని తెలిపారు. క్రికెట్ ,వాలీబాల్,చెస్,క్యారమ్స్,టగ్ ఆఫ్ వార్,కబడ్డీ,షటిల్ బాడ్మింటన్,అథ్లెటిక్స్,5 కిలోమీటర్ల పరుగు పందెం వంటి క్రీడలను నిర్వహించడం జరుగుతుందని తెలియజేశారు.గెలుపోటములు సహజమని క్రీడాకారులందరూ స్పోర్టింగ్ స్పిరిట్ తో ఆడాలని అన్నారు.పోలీసు అధికారులు , సిబ్బంది తమ తమ శారీరక సామర్థ్యాన్ని పెంచుకోవడానికి, మానసికోల్లాసానికి ఏర్పాటుచేసిన ఈ క్రీడలను సద్వినియోగం చేసుకోవాలని అన్నారు.ఈ స్పోర్ట్స్ మీట్ పేరెడ్ ఏర్పాట్లను అద్భుతంగా తయారుచేసిన అధికారులను అభినందించారు. అనంతరం ముందుగా హోంగార్డ్స్ టీమ్ , పాల్వంచ సబ్ డివిజన్ మధ్య జరిగిన వాలీబాల్ మ్యాచ్ ను టాస్ వేసి ఎస్పీ ప్రారంభించారు.అనంతరం జిల్లా పోలీస్ కార్యాలయ టీం, ఇల్లందు సబ్ డివిజన్ టీమ్ ల మధ్య ఉత్కంటభరీతంగా జరిగిన క్రికెట్ మ్యాచ్ ను తిలకించారు.

# జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవాన్ని విజయవంతం చేయాలి

* జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్.



ప్రజా స్ఫూర్తి,భద్రాద్రి కొత్తగూడెం: జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవాన్ని విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ అధికారులను ఆదేశించారు. గురువారం ఐడిఓసి కార్యాలయం సమావేశ మందిరంలో ఈ నెల 10వ తేదీన నిర్వహించనున్న జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవం రోజున 1 నుండి 19 సంవత్సరాల వయసు గల వారందరికీ నులిపురుగులను నివారించే ఆల్బెండజోల్ మాత్రలను అందించాలన్నారు. ముఖ్యంగా ఎస్సీ, ఎస్టీ, బిసి, మైనార్టీ , గిరిజన ఆశ్రమ పాఠశాలలు , వసతి గృహాలలో ప్రతి విద్యార్థులకు మాత్రలు అందించాలని అధికారులను ఆదేశించారు. ఈ మాత్రల ద్వారా పిల్లల్లో రక్తహీనత, బుద్ధిమధ్యం నివారించవచ్చు, చదువుల పట్ల ఏకాగ్రత పెంపొందుతుందన్నారు. విద్యాశాఖ, ఏఎన్ఎం, అంగన్వాడీలు సమన్వయంగా పనిచేసి జిల్లాలోని విద్యార్థులందరికీ మాత్రలను అందివ్వాలి అన్నారు. ప్రభుత్వ,ప్రైవేటు పాఠశాలల విద్యార్థులు, అంగన్వాడి పిల్లలకు మాత్రలు అందించాలన్నారు. అంగన్వాడి టీచర్లకు శిక్షణ ఇచ్చి వయసుల వారీగా మాత్రల డోస్ ఇవ్వాలన్నారు. భోజనం తర్వాతనే ఆల్బెండజోల్ మాత్రలు వేయించాలన్నారు. మాత్రలు వేసే ప్రదేశంలో తగినంత త్రాగునీరు అందుబాటులో ఉంచుకోవాలన్నారు. జిల్లాలో 336,212 మంది ఒకటి నుంచి 19 సంవత్సరాల వయసు గల వారు ఉన్నారని ఆయన తెలిపారు. వారి అందరికీ మాత్రలు అందించాలని తెలిపారు. ప్రత్యేక షెడ్యూల్ ని ఏర్పరచుకొని నులిపురుగుల నిర్మూలన మాత్రలు అందివ్వాలన్నారు. ప్రజలకు అర్బెండజోల్ మాత్రల ఉపయోగాలపై కళా జాతర బృందాలు , మహిళా సమాఖ్యల ద్వారా విస్తృత అవగాహన కల్పించి, పిల్లలందరూ మాత్రలు తీసుకునేలా ప్రోత్సహించాలన్నారు. 10వ తేదీన మాత్రలు తీసుకొని వారికి 17వ తేదీన మాప్ ఆఫ్ డే నిర్వహించి మాత్రలు అందించాలన్నారు. ప్రైవేటు విద్యాసంస్థలు అన్ని విద్యార్థులకు మాత్రలు అందేలా చూడాలని, అనంతరం నివేదికలు సమర్పించాలని అన్నారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేసి నులిపురుగుల నిర్మూలలకు కృషి చేయాలని కలెక్టర్ అన్నారు. ఈ సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యా చందన, జడ్పీ సీఈవో నాగలక్ష్మి, వైద్య శాఖ అధికారి భాస్కర్ నాయక్, డిసిహెచ్ఓ రవిబాబు, మహిళా, శిశు మరియు వయోవృద్ధుల సంక్షేమ అధికారి స్వర్ణలత లెనీనా, బీసీ సంక్షేమ అధికారి ఇందిరా, ఎస్సీ డెవలప్మెంట్ అధికారి అనసూయ, జిల్లా ఇంటర్మీడియట్ అధికారి వెంకటేశ్వర్లు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.




# సమాచార హక్కు చట్టం సామాన్యుడి చేతిలో వజ్రాయుధం

* తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యక్షులుగా గోపీనాథ్ కట్టెకోల ఏకగ్రీవంగా ఎన్నిక

కూకట్ పల్లి, (ప్రజాస్ఫూర్తి) : సమాచార హక్కు చట్టం సాధన కమిటీ తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యక్షులుగా గోపీనాథ్ కట్టెకోల ను నియమితులయ్యారు. గురువారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సమాచార హక్కు చట్టం సాధన కమిటి జాతీయ వ్యవస్థాపక అధ్యక్షులు డాక్టర్. చంటి ముదిరాజ్, రాష్ట్ర అధ్యక్షురాలు సూర స్రవంతి నియామక పత్రాన్ని అందజేశారు.ఈ సందర్భంగా వ్యవస్థాపక జాతీయ అధ్యక్షులు డాక్టర్. చంటి ముదిరాజ్ మాట్లాడుతూ సమాచార హక్కు చట్టం 2005 ప్రతి ప్రభుత్వ కార్యాలయంలో పకడ్బందీగా అమలు చేయాలన్నారు. ఆర్టిఐ బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు. ప్రజలు కోరిన సమాచారాన్ని 30 రోజుల్లోపు ఇవ్వాలని, వ్యక్తి గత స్వేచ్ఛకు భంగం కలిగినప్పుడు, ప్రాణహాని ఉన్నప్పుడు కేవలం 48 గంటలలో సమాచారం అధికారులు ఇవ్వాలని అన్నారు.సమాచార హక్కు చట్టం ప్రజల చేతిలో బ్రహ్మాస్త్రం అని ప్రజలతో పాటు అధికారులు కూడా ఈ చట్టాన్ని సద్వినియోగం చేసుకొని గ్రామ పంచాయతి నుండి మొదలుకొని పార్లమెంటు వరకు అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో దరఖాస్తు చేసుకొని 30 రోజుల్లో సమాచారం తీసుకోవచ్చని అన్నారు. ఈ చట్టాన్ని ప్రజా ప్రయోజనాల నిమిత్తం సద్వినియోగం చేసుకోవాలని దుర్వినియోగం చేయకూడదని అవసరమైన సమాచారం మేరకే ప్రభుత్వ కార్యాలయాల్లో సమాచారం తీసుకోవాలని సూచించారు. రాష్ట్ర ఉపాధ్యక్షులుగా ఎన్నికైన గోపీనాథ్ మాట్లాడుతూ సమాచార హక్కు చట్టం 2005 ప్రకారం గ్రామ పంచాయతీలు మొదలుకొని పార్లమెంటు వరకు అన్ని ప్రభుత్వ కార్యాలయాలు ప్రతి పౌరుడు దరఖాస్తు చేసుకొని తనిఖీ చేయవచ్చన్నారు. ప్రభుత్వ కార్యాలయాలకు వెన్నెముక అయిన సమాచార హక్కు చట్టం 2005 కు సంబందించిన 4 (1) బి సంబంధించిన 17 అంశాల సమాచారం, రిజిస్టర్ 1, రిజిస్టర్ 2 న గల కాపీలను ఉచితంగా, స్వచ్ఛందంగా ప్రజలకు కోరినప్పుడు అధికారులు ఇవ్వాలని అన్నారు. మూడో వ్యక్తి సమాచారం విషయంలో ప్రజా ప్రయోజనాలకు ఉపయోగపడే సమాచారం అయితే సెక్షన్ 11 (1) ప్రకారంగా దరఖాస్తుదారునికి అధికారులు సమాచారం ఇవ్వాలన్నారు. సమాచారం ఇవ్వని అధికారులకు కనిష్టంగా 250 నుండి గరిష్టంగా 25 వేల వరకు జరిమానాలు సమాచార హక్కు చట్టం రాష్ట్ర కమిషనర్ విధిస్తారన్నారు. సమాచార హక్కు చట్టం 2005 ప్రకారం సిబిఐ, సిఐడి, కోర్టు జడ్జిమెంట్, దేశ భద్రత సమాచారం, పోలీస్ స్టేషన్ భద్రత, ఆయుధాల సమాచారాన్ని మినహాయించబడిందన్నారు. ప్రతి ఒక్కరు ఈ చట్టాన్ని సద్వినియోగం చేసుకొని ప్రభుత్వ కార్యాలయాల్లో జరుగుతున్న అవినీతిని బయటకు తీయాలన్నారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లం వెంకటేశం గౌడ్,రాష్ట్ర సంయుక్త కార్యదర్శి బత్తుల మహేష్ గౌడ్, రంగారెడ్డి జిల్లా సంయుక్త కార్యదర్శి దీపక్ కులకర్ణి,పందుల రాజు గౌడ్, కె.రామయ్య తదితరులు పాల్గొన్నారు.



# తీన్మార్ మల్లన్న పై జగద్గిరిగుట్ట పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు

జగద్గిరిగుట్ట, (ప్రజాస్ఫూర్తి) : రెడ్డి కులస్తులను అవమానపరిచే విధంగా వ్యాఖ్యలు చేసిన తీన్మార్ మల్లన్నపై కేసు నమోదు చేయాలని గురువారం రెడ్డి సంఘం సభ్యులు డిమాండ్ చేశారు. ఎమ్మెల్సీ, జర్నలిస్టు తీన్మార్ మల్లన్న (చింత పండు నవీన్ కుమార్) రెడ్డి కులస్తులను అవమానపరిచే విధంగా వ్యాఖ్యలు చేసిన తీన్మార్ మల్లన్న తీరును నిరసిస్తూ గురువారం జగద్గిరిగుట్ట చివరి బస్ స్టాప్ లో రెడ్డి సంఘం ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. అనంతరం జగద్గిరిగుట్ట సీఐ నరసింహులు కి తీన్మార్ మల్లన్న పై కేసు బుక్ చేయాలని కోరుతూ ఫిర్యాదు చేశారు. ఈ కార్యక్రమంలో రెడ్డి సంఘం నాయకులు గుజ్జుల బాబు రెడ్డి, తిరుమల్ రెడ్డి, విష్ణువర్ధన్ రెడ్డి, వీరారెడ్డి, ఎస్ లక్ష్మారెడ్డి, కే నరసింహారెడ్డి, అనంతరెడ్డి, పి సంజీవరెడ్డి, బుచ్చిరెడ్డి, నరసింహారెడ్డి, వెంకట్ రెడ్డి, పున్నారెడ్డి, నరేందర్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, ధర్మారెడ్డి, ప్రభాకర్ రెడ్డి, రాజేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా ప్రారంభమైన సుధాకర్ రెడ్డి మెమోరియల్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్ పోటీలు




ప్రజా స్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: భద్రాద్రి జిల్లా కేంద్రం కొత్తగూడెంలో నిర్వహిస్తున్న సుధాకర్ రెడ్డి మెమోరియల్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్ ను గురువారం జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, నాగా సీతారాములు పాల్గొని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇంటర్నేషనల్ బ్యాట్మింటన్ కోచ్ స్వర్గీయ గుజ్జుల సుధాకర్ రెడ్డి మోమోరియల్ పేరిట వరుసగా రాష్ట్ర స్థాయి బ్యాట్మింటన్ పోటీలు నిర్వహిస్తున్న సావిత్రి సుధాకర్ రెడ్డి ని అభినందించారు.ఈ టోర్నమెంట్ ఈ నెల 9 వరకు భద్రాద్రి జిల్లా కేంద్రం కొత్తగూడెంలో జరుగుతుందని తెలిపారు.

# పది రోజుల్లో గ్రూప్1 ఫలితాలు!




హైదరాబాద్: రాష్ట్రంలో 563 గ్రూప్1 పోస్టుల భర్తీకి నిర్వహించిన ప్రధాన పరీక్షల జవాబు పత్రాల మూల్యాంకనం ముగిసింది. అభ్యర్థులు సాధించిన మార్కుల ఆధారంగా 1:2 నిష్పత్తిలో మెరిట్ జాబితా వెల్లడికి టీజీపీఎస్సీ తుది పరిశీలన కొనసాగిస్తోంది. వారం పది రోజుల్లో ఫలితాలు వెల్లడించే అవకాశాలున్నాయి. అనంతరం ఆయా అభ్యర్థుల ధ్రువీకరణ పత్రాల పరిశీలన ఉంటుంది.

# తెలంగాణ రాష్ట్రానికే గుండెకాయగా ఉన్న సింగరేణికి ఎంతో ఘనమైన చరిత్ర ఉంది

*** ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు**




ప్రజా స్ఫూర్తి,భద్రాద్రి కొత్తగూడెం: కొత్తగూడెం బాబు క్యాంపు లోని సీపీఐ కార్యాలయంలో సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ గుర్తింపు కార్మిక సంఘం ఏఐటీయూసీ యూనియన్ ఆధ్వర్యంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. విలేకరుల సమావేశంలో సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు సింగరేణి గుర్తింపు కార్మిక సంఘం ఏఐటియుసి అధ్యక్షులు వాసిరెడ్డి సీతారామయ్య, ప్రధాన కార్యదర్శి రాజ్ కుమార్ పాల్గొన్నారు.ఈ సందర్భంగా కూనంనేని సాంబశివరావు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రానికే తలమానికంగా, గుండెకాయగా ఉన్న సింగరేణికి ఎంతో ఘనమైన చరిత్ర ఉందని , లక్ష మందితో కళకళలాడే సింగరేణి నేడు కళ తప్పిందన్నారు. కొత్త మైన్స్ రాకపోగా, ప్రైవేటీకరణ చేస్తున్నారని విమర్శించారు. కేంద్ర ప్రైవేటీకరణ విధానాలకు వ్యతిరేకంగా సింగరేణి ప్రాంతంలో ఉన్న బొగ్గు బ్లాకులను సింగరేణికి ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వం, యాజమాన్యం గట్టిగా నిలబడడం లేదని, సింగరేణిని కాపాడుదామనే ఆలోచన కనిపించడం లేదని విమర్శించారు. కేవలం లాభం కోసమే ప్రయత్నిస్తున్నారు, సింగరేణి ప్రాంతంలో సింగరేణి మనుగడకే ప్రశ్నార్థకంగా ప్రభుత్వం యాజమాన్యం తీరు ఉన్నదన్నారు. సంస్థ తన బొగ్గు ఉత్పత్తి అంశాన్ని పక్కన పెట్టి ప్రభుత్వ సూచనల మేరకు లాభాలే లక్ష్యంగా సోలార్, విండ్ పవర్, ఐరన్ ఓర్ ఉత్పత్తుల పట్ల దృష్టి పెట్టి ఇతర రాష్ట్రాల్లో పనిచేయడానికి ఆసక్తి చూపుతున్నదని దీంతో సింగరేణి ఉనికే ప్రశ్నార్థకంగా మారిందన్నారు. సంస్థలో ఎంతో కాలంగా పనిచేసి శ్రమించిన కార్మిక కుటుంబాలకు ఎటువంటి ప్రత్యామ్నాయం చూపించకుండా దౌర్జన్యంగా వెళ్ళ గొడుతున్నారని, ఇదేమైనా దిక్కులేని రాష్ట్రమా అంటూ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంట్రాక్టు కార్మికుల వేతనాలు నికృష్టంగా ఉన్నాయని తెలిపారు. సింగరేణి సిఎండి బలరాం మంచివాడే అయినా ప్రభుత్వ గైడ్ లైన్స్ ప్రకారం నడుచుకుంటున్నారని, సింగరేణిలో గత ప్రభుత్వం లాగే రాజకీయ జోక్యం పెరిగిపోయిందని తీవ్రంగా విమర్శించారు. సింగరేణి గుర్తింపు కార్మిక సంఘం ఏఐటీయూసీ అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య మాట్లాడుతూ సింగరేణి నేడు త్రిశంకు స్వర్గంలో ఉన్నదని, అసలు దీనికి బాధ్యులు ఎవరూ లేని పరిస్థితి ఉన్నదని విమర్శించారు.సంస్థ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ కు ముందుగా అనే ఎక్స్టెన్షన్ ఇవ్వాల్సి ఉండగా గత రెండు నెలలుగా ఎక్స్టెన్షన్ రేపు రేపు అనుకుంటూ కాలయాపన చేశారని, డైరెక్టర్స్ గా ఉన్నవాళ్లకు ఎక్స్టెన్షన్ ఇవ్వలేదు, కొత్త వారికి ఇంటర్వ్యూ జరగలేదని, ఇవాళ సింగరేణిలో డైరెక్టర్ లేరని విమర్శించారు. దీంతో కార్మికుల సమస్యలు పెండింగ్ లో ఉన్నాయని, ప్రొడక్షన్ కూడా సరిగా రావడం లేదన్నారు. దీనికి సరైన బాధ్యులు లేకపోవడంతో ఇబ్బందులు పడాల్సి వస్తున్నదన్నారు.వంద సంవత్సరాల సింగరేణి చరిత్రలో ఈ విధంగా డైరెక్టర్స్ లేకుండా సి అండ్ ఎండీ కి ఎక్స్టెన్షన్ ముందే ఇవ్వకుండా జరిగిన పరిస్థితి ఏనాడు లేదన్నారు. కాబట్టి తక్షణమే దీనిని పరిష్కారం చేస్తేనే కార్మికుల సమస్యలు పరిష్కారం అవుతాయన్నారు. సింగరేణి ఎన్నికలు జరిగి సంవత్సరం గావస్తున్నా గుర్తింపు కార్మిక సంఘంతో చైర్మన్ స్థాయి సమావేశం ఇంతవరకు జరగలేదన్నారు. ఎన్నికల కోడ్ పేరుతో కార్మిక సంక్షేమాన్ని విస్మరిస్తున్నదని ఆగ్రహం వ్యక్తం చేశారు. సింగరేణి కార్మికులకు సొంతింటి పథకానికి 200 గజాల స్థలం ,25 లక్షల రూపాయల వడ్డీ లేని బ్యాంకు రుణాలు ఇప్పిస్తే, కార్మికులకు క్వార్టర్స్ నిర్మించాల్సిన అవసరం ఉండదని తెలిపారు.కాంట్రాక్ట్ కార్మికులకు కోల్ ఇండియాలో హై పవర్ వేతనాలు ఇస్తుంటే సింగరేణిలో వేతనాలు సరిగా ఇవ్వడం లేదని అన్నారు.కోడ్ ఆఫ్ డిసిప్లిన్ లేకుండా గుర్తింపు కార్మిక సంఘంతో సంప్రదింపులు లేకుండా యాజమాన్యం కేవలం ప్రభుత్వం సూచనలు మేరకే నడుచుకుంటున్నదని విమర్శించారు. గుర్తింపు కార్మిక సంఘంతో సింగరేణి సీఎండీ స్థాయి సమావేశం నిర్వహించకపోవడం, గుర్తింపు కార్మిక సంఘాన్ని పట్టించుకోకపోవడం దారుణమని, అలాంటప్పుడు కార్మిక సంఘం ఎన్నికలు నిర్వహించడం ఎందుకని ప్రశ్నించారు. సింగరేణి యాజమాన్యం అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ కార్మిక హక్కుల కోసం సంక్షేమం కోసం రాబోయే రోజుల్లో పెద్ద ఎత్తున ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు.కేంద్ర కమిటీ నాయకులు, వివిధ బ్రాంచిల కార్యదర్శులు వాసిరెడ్డి సీతారామయ్య, కె రాజ్ కుమార్, ఏం వెంకటస్వామి, మిర్యాల రంగయ్య, కె సారయ్య, వై వి రావు, మద్ది ఎల్లయ్య, బాజీ సైదా, వంగ వెంకట్, వై రాంగోపాల్, అక్బర్ అలీ, వి మల్లికార్జున్ రావు, రాజారత్నయ్య, జి వీరాస్వామి, రమణమూర్తి, నజీర్ అహ్మద్, పోశం రవీందర్, మల్లేష్ సుధాకర్, కిషన్ రావు తదితరులు పాల్గొన్నారు.

## రాజపేటలో విద్యార్థికి ఇంటి వద్ద విద్యాభ్యాసన పరిశీలన



రాజపేట, ప్రజాస్ఫూర్తి : యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ హనుమంతరావు ఆదేశాలతో గురువారం ఉదయం తహసిల్దార్ దామోదర్, ఎంపీడీవో నాగవేణిలు విద్యార్థి ఇంటి వద్ద విద్యాభ్యాసన పరిశీలన కార్యక్రమంలో పాల్గొన్నారు. గురువారం వేకువ జామున తహసిల్దార్ దామోదర్ చల్లూరు గ్రామంలో దేవేందర్ అనే పదవ తరగతి విద్యార్థి ఇంటికి వెళ్లి ఆయనతో మాట్లాడారు. తల్లిదండ్రులతో మాట్లాడి ఇష్టంతో చదువుతూ ఎస్ఎస్ సీ పరీక్షలో ఉత్తమ ఫలితం సాధించాలని కోరారు. ఈ కార్యక్రమంలో చల్లూరు ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు బి. వసంత, ఉపాధ్యాయ బృందం హిందీ పండిట్ కటకం నాందేవ్, గణిత ఉపాధ్యాయులు సత్తిరెడ్డి, సోషల్ ఉపాధ్యాయులు సుశీల్ తదితరులు ఉన్నారు. పదవ తరగతిలో విద్యార్థుల సంఖ్య విద్యలో వారి పరిస్థితి తహసిల్దార్ అడిగి తెలుసుకుని నూరు శాతం ఉత్తీర్ణత సాధించాలని ఉత్తమ ఫలితాలు రాబట్టాలని కోరారు. అందుకు ప్రతి ఒక్కరు కృషి చేయాలన్నారు. బేగంపేట గ్రామంలో ఆవుల రాజేష్ ఇంటికి వేకువజామున వెళ్లిన ఎంపీడీవో నాగవేణి విద్యార్థి నైపుణ్యం పరిశీలించారు. ఉత్తమ ర్యాంకు పొంది బంగారు భవిష్యత్తు కి బాటలు వేసుకోవాలని కోరారు. ఎస్ఎస్సి పరీక్షలు సమీపిస్తుండడంతో మనోధైర్యంగా ఉండాలని ఎలాంటి జంకు లేకుండా పరీక్షలు రాయాలన్నారు. కాగా ప్రత్యేక అధికారి జినుకల శ్యాంసుందర్ గురుకుల పాఠశాలను సందర్శించాల్సి ఉండగా అనారోగ్య కారణంగా సెలవులో ఉండడంతో పాఠశాలకు విద్యార్థి ఇంటి వద్ద విద్యాభ్యాసన పరిశీలన కార్యక్రమం లో పాల్గొనలేదు.

## గ్రామ పంచాయితీ కార్మికుల పొట్ట కొడితే చూస్తూ ఊరుకోం..

*** సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఏజె. రమేష్**




ప్రజా స్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం : సీఐటీయూ, కార్మిక సంఘాల పోరాటాల ఫలితంగా ప్రతి నెల రూ.12,500 లు ఫిక్స్డ్ వేతనం ఇస్తున్నారని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఏజె. రమేష్ అన్నారు. లక్ష్మీదేవి పల్లి మండల కేంద్రంలో ఉన్న ఆరు పంచాయితీ ల కార్మికులు చేస్తున్న నిరవధిక సమ్మె కు సీఐటీయూ నాయకులు సంపూర్ణ మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోజంతా కష్ట పడి పనిచేస్తూ, గ్రామాలన్నీ శుభ్రత గా ఉంచుతూ ప్రజల ఆరోగ్యాన్ని కాపాడుతూ , గ్రామాల అభివృద్ధికి తోడ్పడుతున్న కార్మికులకు చాలి చాలని వేతనాలు సరిపోక జీవితాలను వెళ్లదీస్తున్న వారికి అధికారులు అండగా ఉండకుండా గత నెల నుండి పాలకవర్గం లేదు అనే తప్పుడు నిర్ణయాలతో జీతాలు తగ్గిస్తూ 9500 ఇస్తామని చెప్పడం కార్మికుల పొట్ట కొట్టడమే అవుతుందని అన్నారు. అధికారులు తీసుకున్న నిర్ణయం సరైంది కాదని, తప్పుడు నిర్ణయాలతో మా బతుకులు ఆగం చేస్తే ప్రతిఘటన తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. సమస్య పరిష్కారం అయ్యేవరకు కొనసాగించే అవకాశం ఉందని అన్నారు. రాష్ట్ర వ్యాప్త ఉద్యమానికి ఆదర్శంగా నిలబడాలని కోరారు.శిబిరాన్ని సందర్శించి , సంపూర్ణ మద్దతు ప్రకటించడం జరిగిందన్నారు. కార్మికుల సమ్మె కు మద్దతు సంపూర్ణంగా ఉంటుందని, దశల వారీగా ఉద్యమాలు చేస్తున్నామని తెలిపారు. స్థానిక శాసన సభ్యులు దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కారం కోసం కృషి చేద్దాం అన్ని అన్నారు. అధికారులు తీసుకున్న నిర్ణయం సరైంది కాదని అన్నారు. చాలి చాలని వేతనాలు అమలు చేస్త ప్రతిఘటన తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు.

## హర్యానా గవర్నర్ బండారు దత్తాత్రేయను కలిసిన బీజేపీ నేతలు



కుత్బుల్లాపూర్, (ప్రజాస్ఫూర్తి ) : హర్యానా గవర్నర్ బండారు దత్తాత్రేయను గురువారం బీజేపీ ఓబిసి మోర్చ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నందనం దివాకర్ మర్యాద పూర్వకంగా కలిశారు. అనంతరం ఆయనను శాలువాతో సత్కరించి పుష్పగుచ్ఛం అందించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు కృష్ణమూర్తి, బక్క శంకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఇంటి యజమానులందరూ
## ఆవు దూడ గుర్తుపై ఓటు వేసి గెలిపించండి

*** అధ్యక్ష అభ్యర్థి చంద్ర రెడ్డి**





శేరిలింగంపల్లి, (ప్రజాస్ఫూర్తి) : కూకట్ పల్లి డివిజన్ పాపిరెడ్డి నగర్ బస్తీలో శుక్రవారం జరిగే సంక్షేమ సంఘం ఎన్నికల్లో బస్తీకి చెందిన ఇంటి యజమానులందరూ ఆవు దూడ గుర్తుపై ఓటు వేసి అధ్యక్షుడిగా మరోమారు గెలిపించాలని పాపిరెడ్డి నగర్ బస్తీ అధ్యక్ష అభ్యర్థి ఊట్ల చంద్రారెడ్డి బస్తీ వాసులకు విజ్ఞప్తి చేశారు. ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు పోలింగ్ కొనసాగుతుందని ప్రతి ఒక్కరు తమ విలువైన ఓటు హక్కును వినియోగించుకోవాలని తెలిపారు. బస్తీలోని రోడ్ నెంబర్ 9 లో గల శ్రీ నల్ల పోచమ్మ తల్లి ఆలయంలో పోలింగ్ జరుగుతుందన్నారు. స్టీరింగ్ కమిటీ సభ్యులు ఇచ్చిన ఐడి కార్డుతో పాటుగా ప్రభుత్వ గుర్తింపు కార్డు (ఆధార్ , డ్రైవింగ్ లైసెన్స్ ,ఓటర్ ఐడి )ఏదైనా ఒకటి వెంట తీసుకుని వచ్చి ఓటును వినియోగించుకోవాలని చంద్రారెడ్డి సూచించారు. ఆవు దూడ గుర్తుపై ఓటు వేసి అత్యధిక మెజార్టీతో అధ్యక్షుడిగా మరోమారు గెలిపించాలని బస్తి వాసులకు చంద్రారెడ్డి విజ్ఞప్తి చేశారు

## జర్నలిస్టుల ఇళ్ల స్థలాలు ఇస్తారా మాస్ లైన్ డిమాండ్



దమ్మపేట, ప్రజాస్ఫూర్తి: దమ్మపేట హామీలు తప్ప అమలు కానీ (విలేకరుల) జర్నలిస్టుల ఇళ్ల స్థలాలు వెంటనే అమలు చేయాలి. సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు అమర్లపూడి రాము డిమాండ్ మరణాన్ని సవాలుగా తీసుకొని ప్రజల కోసం పనిచేస్తున్న విలేకరులు (జర్నలిస్ట్) లు అంటే రాజకీయ నాయకులకి. మాఫియాలకు. రౌడీలకు గుండాలకు సవాలుగా తన కలాన్ని నమ్ముకొని బ్రతుకుని ఏ క్షణంలో మరణ వస్తుంది తో అని ఆలోచించకుండా నిజాయితీగా నిర్భయంగా ప్రజలకు న్యాయం జరిగే విధంగా తెల్లవారక ముందే వార్తలు ప్రజలకు వద్దకు తీసుకెళ్తున్న విలేకరులకు ప్రభుత్వాలు హామీలు ఇస్తున్నారు తప్ప నాయకులు పదవులు పొంది లబ్ధి పొందుతున్నారు తప్ప వారికి ఎలాంటి ఇండ్ల స్థలాలు కానీ ఇండ్లు కానీ వారికి ప్రమాద బీమా ఇన్సూరెన్స్ కానీ ఏ ప్రభుత్వాలు ఇవ్వటం లేదనిజిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు అమర్లపూడి రాము అన్నారు. ప్రధాన మంత్రులు, ముఖ్యమంత్రులు, మంత్రులు, ఎమ్మెల్యేలు ఎంతో విలాసమైన జీవితాలు గడుపుతున్న వారు వేసి కార్లలో పరిపాలన నడిపిస్తున్న వారికి మాత్రం భోగ భాగ్యాల అనుభవిస్తున్నారని. ఎలాంటి పారితోసుకోలేని సావే జీవన్మరణంగా బతుకుతున్న విలేకరులకు రాష్ట్ర మంత్రి లు తక్షణమే జర్నలిస్టులందరికీ ఇళ్ల స్థలాలు ఇచ్చి గౌరవాన్ని నిలుపుకోవాలని. జర్నలిస్టులందరికీ ఇళ్ల స్థలాలు ఇండ్లు ఇవ్వకపోతే ప్రాణ త్యాగాల కు వెనకాడదని వారికోసం సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ ప్రజా పోరాటాలు ఉధృతం చేస్తుందని అమర్లపూడి రాము డిమాండ్ చేశారు.

## వాహనదారులు
## తప్పని సరిగా ట్రాఫిక్ నియమాలను పాటించాలి

*** బాలానగర్ ఏసీపీ హనుమంతరావు**




కుత్బుల్లాపూర్, (ప్రజాస్ఫూర్తి) : వాహనదారులు తప్పని సరిగా ట్రాఫిక్ నియమాలను పాటించాలని బాలానగర్ ఏసీపీ హనుమంతరావు అన్నారు. గురువారం రాత్రి జీడిమెట్ల పోలీస్ స్టేషన్ పరిధిలో ఐడిపిఎల్ చౌరస్తా వద్ద స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆయనతో పాటు జీడిమెట్ల సిఐ గడ్డం మల్లేష్ లు పాల్గొని ఎవరైతే హెల్మెట్ ఉండి కూడా పెట్టుకోకుండా బండి , డిక్కీలో పెట్టేసి నిర్లక్ష్యంగా డ్రైవింగ్ చేస్తున్నటువంటి వాహనదారులను ఆపి వారికి ప్రత్యేకంగా హెల్మెట్స్ గురించి ఇంపార్టెన్స్ ను వారికి తెలియజేశారు. హెల్మెట్ ను వారు పెట్టుకునేలా ప్రోత్సహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాహనదారులు తప్పని సరిగా హెల్మెట్ ధరించాలన్నారు. వాహనదారులు హెల్మెట్ , సీటి బెల్టు పెట్టుకుని తమ ప్రాణాలను కాపాడుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐలు, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## వైభవంగా శ్రీ షిరిడి సాయిబాబా ఆలయం వార్షికోత్సవం



శేరిలింగంపల్లి, (ప్రజాస్ఫూర్తి) : ఆల్విన్ కాలనీ డివిజన్ పరిధిలోని ఎల్లమ్మబండ ఎన్టీఆర్ నగర్ లో గల శ్రీ షిరిడి సాయిబాబా ఆలయం వార్షికోత్సవం గురువారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ వేడుకలకు స్థానిక కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్, యువనేత దొడ్ల రామకృష్ణ గౌడ్ లు పాల్గొని హోమము , హారతి పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం భక్తులకు అన్నసమరాధన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సాయినాథుడి కృపతో ప్రజలంతా సుఖ సంతోషాలతో ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ సిబ్బంది, సాయిబాబా భక్తులు, స్థానిక వాసులు తదితరులు పాల్గొన్నారు.



# జై భీమ్ రావు భారత్ పార్టీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ గా యెర్రా కామేష్ నియామకం

* **నియామక పత్రం అందజేసిన పార్టీ జాతీయ అధ్యక్షులు జడ శ్రావణ్ కుమార్**



హైదరాబాద్ 06, ఫిబ్రవరి : జై భీమ్ రావు భారత్ పార్టీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ గా భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కొత్తగూడెం పట్టణానికి చెందిన హైకోర్టు న్యాయవాది,సీనియర్ రాజకీయ నాయకులు యెర్రా కామేష్ ను నియమిస్తూ జైభీమ్ రావు భారత్ పార్టీ జాతీయ అధ్యక్షులు,మాజీ న్యాయమూర్తి జడ శ్రావణ్ కుమార్ ఆదేశాలు జారీ చేశారు. ఈసందర్భంగా కామేష్ మాట్లాడుతూ జేబీపీ పార్టీ తెలంగాణ రాష్ట్రంలో ఒక నూతన రాజకీయ శకానికి నాంది పాలకనుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రభుత్వ, ప్రైవేట్ సంస్థలలో రూల్ ఆఫ్ రిజర్వేషన్ తప్పనిసరి చేయడానికి దానిపై ఉద్యమాలు చేపడతామని,ప్రభుత్వ రంగ సంస్థలను నిర్వీర్యం చేస్తూ..ప్రజా ధనాన్ని దోచుకు తింటున్న అధికారులపై,వారికి అన్ని విధాల సహకరిస్తున్న అధికార పార్టీ రాజకీయ నాయకులపై చట్ట ప్రకారం పోరాటం చేస్తామని పేర్కొన్నారు. అదేవిదంగా జనాభాలో 90 శాతానికి పైగా ఉన్న బహుజనులకు రాజ్యాధికారమే లక్ష్యంగా జేబీపీ పార్టీ కృషి చేస్తుందని,తను ఏరోజు అధికారం కోసం వెంపర్లాడలేదని 20 సంవత్సరాలకు పైగా రాజకీయ జీవితంలో ఎప్పుడూ ప్రతిపక్షంలోనే ఉంటూ ప్రజా సమస్యలపై అలుపెరగని పోరాటం చేయడం జరిగిందని అన్నారు.ప్రజల కనీస అవసరాలు తీర్చడంలో పూర్తిగా విఫలమైన రాష్ట్ర ప్రభుత్వంపై రాష్ట్ర స్థాయి ఉద్యమాలు చేపడుతామని ప్రజలను చైతన్యవంతులను చేస్తామని తెలిపారు.



# 'కూరలు' పండడం లేదు!

* **అనూహ్య వాతావరణ మార్పుల ప్రభావం**
* **పంట నష్టాలు.. తగ్గుతున్న దిగుబడులు**
* **ఉద్యాన శాస్త్రవేత్తల అధ్యయన నివేదిక**

హైదరాబాద్: అకాల వర్షాలు, కుంభవృష్టి.. అమాంతం పెరిగే చలి.. అత్యధిక ఉష్ణోగ్రతలు, వడగాలులు.. ఇలా వాతావరణంలో సంభవిస్తున్న అనూహ్య మార్పులు తెలంగాణలో కూరగాయల సాగుపై తీవ్ర ప్రతికూల ప్రభావం చూపుతున్నాయి. దిగుబడులు తగ్గి.. నష్టాలు సంభవిస్తున్నాయి. ఈ మేరకు ఉద్యాన శాస్త్రవేత్తల తాజా అధ్యయనం పలు అంశాలను వెల్లడించింది. రాష్ట్రంలో ప్రస్తుతం ఉన్న 442 వ్యవసాయ మండలాలకు గాను 123 మండలాలు (దాదాపు 28%) వాతావరణ మార్పులకు లోనవుతుండగా ముున్ముందు ఈ సంఖ్య పెరిగే పరిస్థితులున్నాయని వివరించింది. ఇక్రిశాట్ శాస్త్రవేత్త ఎండీఎం కడియాల నేతృత్వంలో శ్రీధర్ గుమ్మడి, మహమ్మద్ ఇర్షాద్, రామరాజు పాల ఆధ్వర్యంలో ఈ అధ్యయనం జరిగింది. ఈ మేరకు తెలంగాణలో వాతావరణ మార్పుల ప్రభావంపై నివేదిక విడుదల చేశారు. ఇందులోని ముఖ్యాంశాలివి..

**పంటలపై ప్రభావం..**

పలు జిల్లాల్లో వర్షాకాలంలో 15 రోజులకు మించి వర్షం పడటం లేదు. దీంతో పంట పెరుగుదల దశలో నీటి కొరత ఏర్పడి నష్టాలు, దిగుబడులు తగ్గడం వంటి పరిస్థితులు ఎదురవుతున్నాయి. ఉష్ణోగ్రతల్లో మార్పులు మొక్కల పెరుగుదల, పూత, కాతలపై ప్రభావం చూపుతున్నాయి. ఒక్కోసారి అనూహ్యంగా చలి పెరగడం కూడా పంటలను దెబ్బతీస్తోంది. టమాటా, ఉల్లి, మిర్చి, బీర, బెండ, సొర, ఆకుకూరలు వంటి పంటలపై ప్రభావం పడుతోంది. చీడపీడల వ్యాపితో పురుగు మందులు వాడాల్సి వస్తోంది. రాష్ట్రంలోని ప్రభుత్వ సంస్థలతో పాటు విశ్వవిద్యాలయాలు, పరిశోధన సంస్థలు, ప్రభుత్వేతర సంస్థలు వాతావరణ మార్పుల ప్రభావంపై దృష్టి సారించాయి. వాటికి క్షేత్రస్థాయిలో స్థానిక వాతావరణ సమాచారం లభించడం లేదు. దీంతో అధ్యయనాలు సరిగా సాగడం లేదు.

**ఏం చేయాలి?**

ప్రభుత్వం వ్యవసాయాన్ని సాధ్యమైనంత వాతావరణ స్థితిస్థాపకంగా మార్చడానికి దీర్ఘకాలిక ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టాలి. వాతావరణ మార్పులకు గురయ్యే ప్రాంతాల్లో ప్రత్యేక వ్యూహాలను అమలు చేయాలి. మార్పుల ప్రభావాన్ని తట్టుకునే రకాల సాగును ప్రోత్సహించాలి. స్థిరమైన పంటల ఉత్పత్తికి సమగ్ర విధానం అవసరం. దీనికోసం కేంద్ర ప్రభుత్వంలోని 'జాతీయ వాతావరణ మార్పు నిధి' కింద నిధులు సమకూరుతాయి. ఎప్పటికప్పుడు రైతులకు అవసరమైన సమాచారాన్ని అందజేయాలి.

రాష్ట్రంలో పండ్లు, పూలు, కూరగాయలు, ఔషధ, సుగంధ పంటలు 13 లక్షల ఎకరాల్లో సాగవుతున్నాయి. రాష్ట్ర జనాభాకు ఏటా 38.54 లక్షల టన్నుల కూరగాయలు అవసరం కాగా ప్రస్తుతం 19.54 లక్షల టన్నులు మాత్రమే ఉత్పత్తి అవుతున్నాయి. మిగతా 19 లక్షల టన్నులను ఇతర రాష్ట్రాల నుంచి దిగుమతి చేసుకోవాల్సి వస్తోంది. దీంతో ధరలు పెరిగి.. వినియోగదారులపై అధిక ధరల భారం పడుతోంది.



# మల్కా కొమురయ్య గెలుపు ఖాయం

* **మద్దతుకు ముందుకొస్తున్న టీచర్ల సంఘాలు**
* **ప్రతిపక్ష ఎమ్మెల్సీ వైపై టీచర్ల మొగ్గు**
* **ప్రచారంలో దూసుకెళ్తున్న మల్కా**
* **ఉత్తర తెలంగాణలో బిజెపికి బలం**













హైదరాబాద్, (ప్రజాస్ఫూర్తి) : ఉమ్మడి కరీంనగర్ జిల్లా ప్రస్తుతం పెద్దపల్లి జిల్లా మారుమూల గ్రామమైన బంధంపల్లిలోని ఓ వ్యవసాయ నిరుపేద కుటుంబంలో 1959 అక్టోబర్ 1న మల్కా కొమురయ్య జన్మించారు. ఆ రోజు ఆ తల్లిదండ్రులకు తెలియదు. తమ బిడ్డ ఈ దేశానికి ఉత్తమ ఇంజనీర్లను, డాక్టర్లను, లాయర్లను, సైంటిస్టులను, నాయకులను తయారు చేసే గురువు అవుతారని. ఉత్తమ సమాజ నిర్మాణానికి మార్గదర్శి అవుతారని. ఆయన మరెవరో కాదు.. విద్యావేత్త, మేధావి, పల్లవి విద్యాసంస్థల అధినేత, ఢిల్లీ పబ్లిక్ స్కూల్స్ చైర్మన్ మల్క కొమరయ్య. రైతు కుటుంబం నుంచి వచ్చిన మల్క కొమరయ్య. సివిల్ ఇంజనీరింగ్ చేసి విద్యావేత్తగా, విద్యాసంస్థల అధిపతిగా ఎదిగిన తీరు అసామాన్యం, సాధారణ జీవనం, ఉన్నతమైన ఆలోచనలు ఆయన నైజం. చెరగని చిరునవ్వు ఆయన బలం. సాధారణ వ్యక్తిగా పుట్టి అసాధారణ వ్యక్తిగా ఎదిగిన మల్క కొమరయ్యపై స్పెషల్ స్టోరీ..

**బాల్యం.. విద్యాభ్యాసం**

1959 అక్టోబర్ 1న ఉమ్మడి కరీంనగర్ జిల్లా పెద్దపల్లిలోని బందెంపల్లిలో లక్ష్మమ్మ, వెంకటయ్య దంపతులకు జన్మించారు కొమురయ్య. కనీసం పాఠశాల కూడా లేని మారుమూల గ్రామంలో పుట్టిన ఆయన స్కూల్ కు 3 కిలోమీటర్ల దూరం నడిచి వెళ్లారంటే చదువంటే ఎంత ఇష్టమో అర్థం చేసుకోవచ్చు. అప్పన్నపేటలో పదో తరగతి పూర్తి చేసుకున్న కొమరయ్య.. ఆర్థిక కష్టాలను ఎదుర్కొని కరీంనగర్ లో ఇంటర్ పూర్తి చేశారు. ఇంటర్ కంప్లీట్ చేయడమే అప్పట్లో గగనం అనుకుంటే ఏకంగా ఉస్మానియా యూనివర్సిటీలో సివిల్ ఇంజనీర్ సీటు సంపాదించి తన ప్రతిభను చాటుకున్నారు.

**విద్యావేత్తగా**

సివిల్ ఇంజనీరింగ్ అంటే అప్పట్లో కోటికో నూటికో ఒకరో ఇద్దరికో సాధ్యమయ్యేది. చదువులో పట్టుదల, కృషితో క్యాంపస్ లో అత్యుత్తమ విద్యార్థిగా పేరు తెచ్చుకున్న కొమురయ్య.. ఉస్మానియా యూనివర్సిటీ విద్యార్థి సంఘానికి జనరల్ సెక్రటరీగా ఎన్నికై తనలోని నాయకత్వ పటిమను ఆనాడే చాటిచెప్పారు. యూనివర్సిటీలో డిగ్రీ పట్టా పొందాక ఆయనలోని విద్యావేత్త మేలుకొన్నాడు. హైదరాబాద్ లో 1994లో పల్లవి గ్రూప్ ఆఫ్ ఇనిస్టిట్యూషన్స్ ను స్థాపించి దశాబ్దాలుగా విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దే మహోత్తరమైన యజ్ఞాన్ని కొనసాగిస్తున్నారు. పల్లవి మోడల్ స్కూల్స్, పల్లవి ఇంజినీరింగ్ కాలేజీలను ఉన్నత స్థాయికి తీసుకెళ్లారు. 2022-2003 మధ్య ఢిల్లీ పబ్లిక్ స్కూల్ ఫ్రాంచైజ్ లను తీసుకొని ఆ బ్రాంచ్ లను సిటీ నలుమూలలా విస్తరించారు. నాచారంలోని ఢిల్లీ పబ్లిక్ స్కూల్ చైర్మన్ గా బాధ్యతలు చేపట్టి మరెంతో మంది స్టూడెంట్లను మేధావులుగా మార్చి సమాజానికి అందించారు. కొమరయ్య వద్ద విద్యనేర్చుకున్న ఎంతో మంది స్టూడెంట్స్ ఇప్పుడు దేశంలో ఐఏఎస్ లు, ఐపీఎస్ లు, ప్రఖ్యాత అడ్వకేట్లు, డాక్టర్లు, సైంటిస్టులుగా దేశానికి సేవలందిస్తున్నారు.

**రియల్ ఎస్టేట్ ఇండస్ట్రీ**

ఉస్మానియా యూనివర్సిటీ లాంటి ప్రఖ్యాత వర్సిటీలో సివిల్ ఇంజనీరింగ్ పూర్తి చేసిన కొమరయ్య.. చదువుకున్న విద్యను ఆచరణలో పెట్టారు. రియల్ ఎస్టేట్ ఇండస్ట్రీ అంటే ఎవరికీ తెలియని ఆ రోజుల్లోనే.. రిమార్కబుల్ ప్రాజెక్టులెన్నో చేపట్టి.. సివిల్ ఇంజనీరింగ్ లో అద్భుతాలను పరిచయం చేశారు. హైదరాబాద్ ఐకాన్ గా పిలవబడుతున్న మినర్వా కాంప్లెక్స్, జూబ్లీహిల్స్ లోని ఓల్డ్ ఎమ్మెల్యే క్వార్టర్స్, మహేంద్రహిల్స్ లోని ధనలక్ష్మికాలనీ,మాధాపూర్ లో పల్లవి ఎన్ క్లేవ్, సికింద్రాబాద్ లో భువన టవర్స్ లాంటి ఎన్నో ఇంజనీరింగ్ అద్భుతాలను కొమరయ్య ఆ కాలంలో సృష్టించారు. ఢిల్లీ, ముంబయి లాంటి నగరాల్లో కూడా ఆయన ఎన్నో సోషల్ ప్రాజెక్టులు చేపట్టారు.

**హెల్త్ సెక్టార్**

స్వతహాగా సేవా గుణం కలిగిన కొమురయ్య.. పేదలకు నాణ్యమైన వైద్యం ఉచితంగా అందించేందుకు నాచారంలో ప్రసాద్ హాస్పిటల్స్ ను ప్రారంభించారు. నిత్యం వెయ్యి మంది వరకు ఈ హాస్పిటల్స్ లో సేవలు పొందుతున్నారు. అంతే కాకుండా హాస్పిటల్ కు కూడా రాలేని స్థితిలో ఉన్న పేదల కోసం ఆయన మరొక అడుగు ముందుకు వేసి.. పేదల బస్తీల్లోనే మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేస్తూ.. వైద్య సేవలు అందిస్తున్నారు. ఇలా ఏటా నిర్వహించే వందలాది హెల్త్ క్యాంప్స్ ప్రజలకు ఎంతో ఉపయోగపడుతున్నాయి.

**ప్రకృతి ప్రేమికుడిగా**

ఈ విశాల విశ్వంలో భూమిపై ఉన్న ప్రకృతి మాత్రమే జీవకోటికి అవసరమైన ప్రాణవాయువు, ఆహారం, నీరు అందిస్తుంది. సకల జీవరాశిలో మనుషుల వాటా అత్యల్పం. కానీ, ప్రకృతికి మనిషి చేసే హాని అత్యంత అధికం. తల్లితో సమానమైన ప్రకృతిని కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిదీ అంటారు మల్క కొమరయ్య. మనల్ని నిత్యం కాపాడుతున్న ప్రకృతి అంటే ఆయనకు ఎంతో ప్రేమ. దాన్ని కాపాడేందుకు నిత్యం తపిస్తూ ఎన్నో కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఏటా లక్షలాది మొక్కలు నాటుతూ పర్యావరణ పరిరక్షణకు కృషి చేస్తున్నారు. ప్లాస్టిక్ భూతం యావత్తు ప్రపంచాన్ని భయపెడుతున్న నేపథ్యంలో.. డీఆర్డీవో టెక్నాలజీతో 'ఎకో భారత్' అనే ప్లాంట్ నెలకొల్పి భూమిలో తేలిగ్గా కలిసి పోయే డీగ్రేడబుల్ కవర్స్ తయారు చేస్తున్నారు. లాభాపేక్ష లేకుండా పర్యావరణ హితమే ధ్యేయంగా ఆ కవర్లను మార్కెట్ కు అందిస్తున్నారు. వ్యవసాయ, ఇతర వ్యర్థాల నుంచి పవర్ జనరేట్ చేసేందు కోసం ఆయన 'శాలివాహన గ్రీన్ ఎనర్జీ'ని నెలకొల్పారు.

**తెలంగాణ వాదిగా**

చరిత్రలో తెలంగాణ ఉద్యమానిది చెరగని సంతకం. స్వరాష్ట్రం కోసం తెలంగాణ సబ్బండవర్గాలు రోడ్డెక్కి కొట్లాడారు. నిఖార్సైన తెలంగాణ వ్యక్తిగా మల్క కొమరయ్య.. తెలంగాణ ఉద్యమంలో అన్ని సమయాల్లో అండగా నిలిచారు. పలు సభలు, వేదికలపై ప్రజా యుద్ధ నౌక గద్దర్ లాంటి వారు అత్యంత ఆప్యాయంగా స్పందిస్తూ.. ''కొమురన్న లాంటి వాళ్ళు మన తెలంగాణలో ఉండటం అదృష్టం'' అనేవారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటులో మల్క కొమరయ్య కృషిని గద్దర్ మాటల ద్వారా అర్థం చేసుకోవచ్చు.

**అవార్డులు**

సాధారణ వ్యక్తిగా మొదలై అసాధారణ వ్యక్తిగా ఎదిగిన మల్క కొమరయ్యను వివిధ రంగాల్లో ఎన్నో అవార్డులు వరించాయి. విద్యారంగంలో ఆయనకు బెస్ట్ అవార్డ్ వచ్చింది. మానవ హక్కుల కోసం చేసిన కృషికి మాజీ రాష్ట్రపతి ఏపీజే అబ్దుల్ కలాం చేతుల మీదుగా ఉత్తమ అవార్డు అందుకున్నారు మల్క కొమరయ్య. ఇవి ఆయన కృషిని తెలిపే కొన్ని మచ్చు తునకలే తప్ప.. కొమరయ్య ప్రశంసల కోసం పాకులాడలేదు.. అవార్డుల కోసం పైరవీలు చేయలేదు.

**ముగింపు**

వేల కిలోమీటర్ల ప్రయాణమైనా ఒక్క అడుగుతోనే మొదలవుతుందంటారు. ఉమ్మడి కరీంనగర్ గడ్డ మీద ఆయన వేసిన మొదటి అడుగు నుంచి నేటి వరకు ఆయన ఎక్కడా వెనక్కి తగ్గలేదు. సరైన ప్రణాళిక, ఆత్మ విశ్వాసంతో పని మొదలు పెట్టడం.. పట్టుదల, కృషిని నమ్ముకొని.. దాన్ని విజయవంతంగా పూర్తి చేయడం ఆయనకు అలవాటు. ఇన్నేళ్ల ఆయన ప్రస్థానంలో ఒడి దొడుకులు ఎన్ని ఎదురైనా, ఎన్ని సందర్భాలు తనను కిందకు లాగాలని ప్రయత్నించినా అవకాశం ఇవ్వలేదు. విజయంతో పొంగిపోకుండా, ఓటమితో కుంగిపోకుండా స్థితప్రజ్ఞుడిగా చెరగని చిరునవ్వుతో తన ప్రయాణాన్ని కొనసాగిస్తూనే ఉన్నారు మల్క కొమరయ్య.






# డయాబెటీస్‌ను కంట్రోల్ చేసేందుకు దొండకాయ తినొచ్చా ?

**ప్రస్తుతం ప్రపంచం మొత్తంలో, ఆరోగ్య సంబంధిత సమస్యలలో షుగర్ వ్యాధి (డయాబెటిస్) ఒక ప్రధాన సమస్యగా మారింది. సమాజంలో పెరుగుతున్న ఈ వ్యాధి విషయంలో, ప్రజలందరూ ఈ వ్యాధిని కంట్రోల్ చేసుకోవడానికి కొన్ని సూచనలు, చిట్కాలు తెలుసుకోవడం మరియు వాటిని అనుసరించడం చాలా ముఖ్యం. అందులో ఒకటి దొండకాయ. డయాబెటీస్‌ను కంట్రోల్ చేసేందుకు దొండకాయ తినొచ్చా ? లేదా అనేది తెలుసుకుందాం .**

దొండకాయ, ఇవి సాధారణంగా కూరగాయలతో కరిగిపోవడంలో, జీర్ణ వ్యవస్థకు మేలు చేసే ఆహార పదార్థంగా పరిగణించబడుతున్నాయి. అయితే, దొండకాయతో సంబంధం ఉన్న అనేక ఆరోగ్య ప్రయోజనాలను, ముఖ్యంగా షుగర్ వ్యాధితో బాధపడేవారికి ఇవ్వగలిగే లాభాలను మనం పరిశీలిద్దాం.

**దొండకాయ తినడం: షుగర్ ఉన్నవారికి సురక్షితమేనా?**

ప్రస్తుత కాలంలో, షుగర్ (డయాబెటిస్) సమస్యతో బాధపడేవారి సంఖ్య రోజురోజుకు పెరుగుతూనే ఉంది. అయితే, ఈ వ్యాధి కంట్రోల్ చేయడం మాత్రం కచ్చితంగా సాధ్యం. దొండకాయ తీసుకోవడం ద్వారా, ఎటువంటి మత్తు లేదా గ్లూకోజ్ స్థాయిలు పెరిగే ప్రమాదం ఉండదు. జాగ్రత్తగా తీసుకుంటే, ఫైబర్ మరియు యాంటీ ఆక్సిడెంట్లు ఉన్న ఈ ఆహారం, రక్తంలో గ్లూకోజ్ లెవల్స్‌ను స్థిరంగా ఉంచడంలో సహాయపడుతుంది.

**1. మితమైన పరిమాణంలో తీసుకోవడం:**

డయాబెటిస్ ఉన్నవారు ప్రతిరోజు దొండకాయ మితంగా తీసుకుంటే, వారు ఆరోగ్యాన్ని మెరుగుపర్చుకోగలుగుతారు. దొండకాయను ఆకుల రసం, కషాయం లేదా తరచుగా కూరగా తీసుకోవడం వల్ల మంచి ఫలితాలు వచ్చే అవకాశం ఉంటుంది.

**2. డైట్‌లో భాగంగా తీసుకోవడం:**

దొండకాయను శుద్ధి చేసిన తర్వాత లేదా తరచుగా తీసుకోవడం వల్ల, అనేక రకాల ఆరోగ్య ప్రయోజనాలు పొందవచ్చు. దొండకాయను జీలకర్రతో, మిరియాలు వేసి కూరగా తీసుకోవడం, లేదా దొండకాయ రసం తాగడం ఈ వ్యాధి కంట్రోల్ లో సహాయపడుతుంది.

దొండకాయలో ఉన్న ఆహార పోషకాల వలన, షుగర్ వ్యాధితో బాధపడే వారు ఆరోగ్యాన్ని మెరుగుపరచుకోవచ్చు. అయితే, జీర్ణకోష సమస్యలు ఉన్నవారు దొండకాయ తీసుకోవడంలో జాగ్రత్త వహించాలి. ప్రస్తుత కాలంలో డయాబెటిస్‌ను కంట్రోల్ చేయడానికి సరైన ఆహారం, వ్యాయామం, మరియు మెరుగైన జీవనశైలిని అనుసరించడం ఎంతో ముఖ్యమైంది. దొండకాయ లాంటి సహజ ఆహార పదార్థాలు, మన ఆరోగ్యాన్ని మెరుగుపరచడం మరియు జీర్ణవ్యవస్థను బలపరచడం లో సహాయపడతాయి.

**డయాబెటిస్‌తో బాధపడేవారికి దొండకాయలు: ఆరోగ్య ప్రయోజనాలు**

1. గ్లూకోజ్ లెవల్స్‌ను కంట్రోల్ చేయడం: డయాబెటిస్ ఉన్న వారు, శరీరంలో గ్లూకోజ్ స్థాయిలను కంట్రోల్ చేయడం ఎంతో ముఖ్యమైనది. దొండకాయలో ఉన్న ఫైబర్, యాంటీ ఆక్సిడెంట్లు మరియు ఇతర పోషకాలు గ్లూకోజ్ గ్రహణాన్ని నెమ్మదిగా చేయటానికి సహాయపడతాయి. ఫలితంగా, రక్తంలో షుగర్ లెవల్స్‌ను మెరుగుపరచి, నియంత్రణలో ఉంచడానికి దొండకాయ ఉపయోగపడుతుంది.

2. ఇన్సులిన్ సెన్సిటివిటీ పెంచడం: దొండకాయ పౌష్టికాహారం రక్తంలో గ్లూకోజ్‌ను సర్దుబాటు చేసే విధంగా పనిచేస్తుంది. శరీరంలో ఇన్సులిన్ సెన్సిటివిటీ పెరుగడం వల్ల, ఇన్సులిన్ చాలా సమర్థవంతంగా పని చేస్తుంది. ఇది రక్తంలో గ్లూకోజ్ స్థాయిలను తగినంత తగ్గించడంలో కీలక పాత్ర పోషిస్తుంది.

3. జబ్బుల నివారణ: దొండకాయ యొక్క ఆకులు, కాండాలు మరియు పసుపు కషాయం అనేక రోగాలను తగ్గించటానికి, నిరోధక శక్తిని పెంచడానికి సహాయపడతాయి. దొండకాయ ఆకుల రసం లేదా కషాయం తీసుకోవడం వల్ల జ్వరం, క్యాన్సర్, చర్మ సంబంధిత సమస్యలు వంటి అనేక ఆరోగ్య సమస్యలకు ఉపశమనం కలుగుతుంది.

4. ఇతర ఆరోగ్య ప్రయోజనాలు:

శ్వాస సంబంధిత సమస్యలు: దొండకాయ ఆకుల రసం లేదా కషాయం తీసుకోవడం వల్ల దగ్గు, శ్వాసకోశ సమస్యలు ఉపశమనం పొందవచ్చు.

పురుగులు అరికట్టడం: దొండకాయ ఆకులు కషాయం చేసి తాగడం వల్ల కడుపులోని పురుగులను దూరం పెట్టగలవు.

ఎప్పుడైనా దొండకాయ తినడం మానుకోవాలి?

అయితే, జీర్ణ సంబంధిత సమస్యలు, మధుమేహం లేదా మెదడుకు సంబంధించిన సమస్యలు ఉన్నవారు దొండకాయలు మితంగా తీసుకోవడం మంచిది. దొండకాయ మాధ్యమంలో కొన్ని ప్రత్యేక ఔషధ గుణాలు ఉంటాయి, కాని ఈ గుణాలు కొన్ని వ్యక్తుల శరీరానికి ఆవర్తనం చేయవచ్చు. అందువల్ల, ఎవరైతే జీర్ణకోషం సంబంధిత సమస్యలు, నాడీ సంబంధిత సమస్యలు కలిగి ఉంటే, వారు సెకండ్ ఓపినియన్లు తీసుకోవడం, డాక్టర్‌ను సంప్రదించడం ఉత్తమం.



## లవంగంలో ఆరోగ్యానికి మేలు చేసే

# ఔషధ గుణాలు

**లవంగం అనేది ఒక చిన్న మరియు శక్తివంతమైన ఔషధ పుష్కలమైన పరికరం, ఇది అనేక ఆరోగ్య ప్రయోజనాలను అందిస్తుంది. ప్రజలు దీనిని సాంప్రదాయంగా ఉపయోగించి వస్తున్నప్పటికీ, ఇటీవల కాలంలో, న్యూట్రీషియనిస్టులు మరియు వైద్యులు కూడా దీని ఉపయోగాలను గుర్తించారు. లవంగంలో ఉన్న విభిన్న పోషకాలు, యాంటీ ఆక్సిడెంట్లు, యాంటీ బ్యాక్టీరియల్ లక్షణాలు మరియు ఔషధ గుణాలు మన ఆరోగ్యాన్ని మెరుగుపరచటంలో కీలకంగా సహాయపడతాయి.**

లవంగం యొక్క ఆరోగ్య ప్రయోజనాలు

ఆరోగ్యకరమైన గ్లూకోజ్ స్థాయిలను కంట్రోల్ చేయడం: లవంగంలో ఉన్న యాంటీ ఆక్సిడెంట్లు మరియు యూజీనాల్ అనే ప్రత్యేక కాంపౌండ్లు, గ్లూకోజ్ స్థాయిలను తగ్గించటానికి సహాయపడతాయి. లవంగాలు రెగ్యులర్‌గా తీసుకోవడం వల్ల రక్తంలో గ్లూకోజ్ స్థాయిలను నియంత్రించవచ్చు, ఇది డయాబెటిస్ ఉన్న వ్యక్తులకు చాలా ఉపయోగకరమైనది.

గొంతు నొప్పికి ఉపశమనం: లవంగం యొక్క యాంటీ ఇన్ఫ్లమేటరీ మరియు యాంటీ బ్యాక్టీరియల్ లక్షణాలు గొంతు నొప్పిని తగ్గించడంలో ఎంతో సహాయపడతాయి. లవంగాన్ని నమలడం ద్వారా గొంతు నొప్పి శీఘ్రంగా తగ్గుతుంది, మరియు గొంతులోని ఇన్ఫెక్షన్‌ను నివారించవచ్చు.

ఆర్థరైటిస్ నొప్పిని తగ్గించడం: లవంగం యొక్క యాంటీ ఇన్ఫ్లమేటరీ గుణాలు, ఆర్థరైటిస్ లేదా అంగుళ నొప్పులను తగ్గించడానికి ఎంతో సహాయపడతాయి. దేనికి కారణమైన జకాన్ని నివారించడంతో, నొప్పుల తగ్గింపులో పెద్ద భాగం పోషిస్తాయి.

కాలేయ ఆరోగ్యాన్ని మెరుగుపరచడం: లవంగాలలోని ఔషధ గుణాలు కాలేయ ఆరోగ్యాన్ని పెంచడానికి సహాయపడతాయి. లవంగాలు పంటలకు సంబంధించిన సమస్యలను తగ్గించడంలో, కాలేయాన్ని ఆరోగ్యంగా ఉంచడంలో దోహదపడతాయి.

రక్తపోటు నియంత్రణ: ఖాళీ కడుపుతో లవంగాలు నమలడం వల్ల రక్తపోటు స్థాయిలను నియంత్రించవచ్చు. ఇది హైపర్‌టెన్షన్ నుండి ఉపశమనం పొందడానికి సహాయపడుతుంది.

ఇన్ఫెక్షన్‌లతో పోరాటం: లవంగం యొక్క యాంటీ బాక్టీరియల్ లక్షణాలు శరీరంలో జరిగే వివిధ రకాల ఇన్ఫెక్షన్ల వృద్ధిని నిరోధిస్తాయి. లవంగాలు బాక్టీరియాలకు వ్యతిరేకంగా పోరాడి, రోగనిరోధక శక్తిని పెంచడంలో సహాయపడతాయి.

నోటి ఆరోగ్యం: లవంగం యొక్క యాంటీ బ్యాక్టీరియల్ మరియు యాంటీ సెప్టిక్ లక్షణాలు నోటి ఆరోగ్యాన్ని మెరుగుపరచడానికి ఎంతో ఉపయోగకరంగా ఉంటాయి. ఇది పంటి నొప్పి, నోటి ఇన్ఫెక్షన్లు తగ్గించడంలో సహాయపడుతుంది. లవంగం నమలడం వల్ల నోటి బాక్టీరియా తొలగిపోతుంది.

జీర్ణక్రియను మెరుగుపరచడం: లవంగంలో జీర్ణ ఎంజైమ్‌లు ఉంటాయి, ఇవి జీర్ణక్రియను మెరుగుపరచటంలో సహాయపడతాయి. ఇది పేగుల ఆరోగ్యానికి మేలు చేస్తుంది మరియు ఆమ్లపదార్థం వంటి జీర్ణ సమస్యలను తగ్గిస్తుంది.

చర్మ ఆరోగ్యం: లవంగం నూనె చర్మ ఆరోగ్యాన్ని మెరుగుపరచడానికి కూడా బాగా పనిచేస్తుంది. ఇది చర్మం మీద దురద, అలర్జీలు, పమ్స్ వంటి సమస్యలను తగ్గించడంలో సహాయపడుతుంది. లవంగం నూనె అనేక అందాల ఉత్పత్తులలో ఉపయోగించబడుతుంది.

శ్వాసకోశ సమస్యలకు ఉపశమనం: లవంగం యొక్క యాంటీ మైక్రోబయల్ లక్షణాలు, బ్రాంకైటిస్, ఆస్తమా, జలుబు, దగ్గు వంటి శ్వాసకోశ సమస్యలకు ఉపశమనం కలిగిస్తాయి. లవంగం నూనె, శ్వాస సంబంధిత సమస్యలను తగ్గించడంలో



# వాహనదారులకు గుడ్‌న్యూస్..

## ఇకపై అన్‌లిమిటెడ్ టోల్ పాస్..



**న్యూఢిల్లీ:** నాగరికతకు చిహ్నాలుగా జాతీయ రహదారులను ప్రమాణంగా తీసుకుంటారు. ప్రపంచంలోనే రెండో అతిపెద్ద రోడ్డు నెట్వర్క్ కలిగిన భారత దేశంలో జాతీయ రహదారుల నిర్మాణం వేగంగా సాగుతోంది. కేంద్ర ప్రభుత్వం భారతమాల పరియోజన పేరుతో హైవేల నిర్మాణం చేపడుతోంది. ప్రస్తుతం జాతీయ రహదారులపై ట్రాఫిక్ కు 60 శాతం కార్లే కారణమని కేంద్ర రోడ్డు రవాణా శాఖ గుర్తించింది. ఈ కార్ల ద్వారా వస్తున్న ఆదాయం 20-26 శాతం మాత్రమే వస్తోంది. పదేళ్లలో కొత్తగా టోల్ ప్లాజాలతోపాటు, ఛార్జీలు పెరగడంతో వాహన దారులు తీవ్ర అసంతృప్తిని వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా మధ్యతరగతి వాహనదారులపై టోల్ ఫీజుల భారాన్ని కాస్తంత తగ్గించే దిశగా కేంద్ర ప్రభుత్వం కొత్త ప్రతిపాదనను తెరపైకి తెచ్చింది.

ప్రైవేట్ కారు ఓనర్లకు సరికొత్తగా 'టోల్ పాస్ విధానం' అందుబాటులోకి తీసుకురావాలని కేంద్ర ప్రభుత్వం భావిస్తోంది. ఈ టోల్ పాస్ విధానంలో రెండు ఆప్షన్లను వాహనదారులకు ఇవ్వాలని కేంద్రం యోచిస్తోంది. సెల్ ఫోన్ రీఛార్జ్ మాదిరిగానే టోల్ విధానంలో మార్పులు తీసుకురావాలని కేంద్ర రోడ్డు రవాణా శాఖ భావిస్తోంది. వార్షిక టోల్ పాస్ రూ. 3000, లైఫ్ టైం టోల్ పాస్ రూ.30 వేలకు అందుబాటులోకి తీసుకొచ్చే యోచనలో కేంద్ర ప్రభుత్వం ఉంది. వార్షిక టోల్ పాస్‌తో ఏడాది పాటు, లైఫ్ టైం టోల్ పాస్‌తో అన్ లిమిటెడ్‌గా జాతీయ రహదారులపై కార్లు రాకపోకలు సాగించే వెసులుబాటును కేంద్ర ప్రభుత్వం కల్పించనుంది. మధ్య తరగతి కుటుంబాలకు, తరచూ ప్రయాణాలు చేయాల్సిన పరిస్థితులను ఎదుర్కొంటున్న వాహనదారులకు టోల్ భారాన్ని వీలైనంత తగ్గించేందుకు కేంద్రం ఈ ప్రతిపాదనలను సిద్ధం చేస్తోంది.

ప్రస్తుతం నెలవారీ టోల్ పాస్ సిస్టం అమల్లో ఉంది. నెలకు 340 రూపాయలు. అంటే.. ఏడాదికి 4,080 రూపాయలు ఖర్చవుతుంది. ఈ ఖర్చును మరింత తగ్గిస్తూ 3 వేల రూపాయలకే వార్షిక టోల్ పాస్‌ను తీసుకొచ్చే యోచనలో కేంద్రం ఉంది. మరోవైపు జాతీయ రహదారులపై ప్రయాణించే వాహన దారులందరికీ ఒకేరకమైన టోల్ విధానం అమలయ్యేలా కేంద్ర ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. తొలుత గ్లోబల్ నావిగేషన్ శాటిలైట్ సిస్టమ్ ఆధారంగా పనిచేసే టోల్ విధానాన్ని అమలు చేయాలని కేంద్ర రోడ్డు రవాణా శాఖ భావిస్తోంది.

## 3 లక్షల హెూండా కార్లు రీకాల్..




**న్యూఢిల్లీ:** హెూండా తన దాదాపు 3 లక్షల వాహనాలను రీకాల్ చేస్తున్నట్లు ప్రకటించింది. దీనికి సంబంధించి కంపెనీ జనవరి 29, 2025న ఒక పత్రికా ప్రకటన విడుదల చేసింది. కారు ఇంజిన్‌లో సమస్యల ఫిర్యాదుల నేపథ్యంలో అమెరికాలో దాదాపు 2.95 లక్షల కార్లను రీకాల్ చేసినట్లు కంపెనీ ప్రకటించింది.

ఇంధన ఇంజెక్షన్ ఎలక్ట్రానిక్ కంట్రోల్ యూనిట్ లోపభూయిష్ట ప్రోగ్రామింగ్ ఉన్నట్లు గుర్తించారు. నేషనల్ హైవే ట్రాఫిక్ సేఫ్టీ అడ్మినిస్ట్రేషన్ ప్రకారం, కారు ఇంజిన్‌లో లోపం వల్ల థ్రోటిల్‌లో ఆకస్మిక మార్పులు సంభవించవచ్చని, దీని వలన ఇంజిన్ డ్రైవ్ పవర్ తగ్గవచ్చని, ఇంజిన్ అడపాదడపా నిలిచిపోవచ్చని లేదా అకస్మాత్తుగా ఆగిపోతుందని హెూండా తెలిపింది. కారు నడుపుతున్నప్పుడు అకస్మాత్తుగా ఇంజిన్ పనిచేయకపోవడం వల్ల ఏదైనా పెద్ద ప్రమాదం సంభవించే అవకాశం ఉందని కంపెనీ తెలిపింది.

## స్టాక్ మార్కెట్లకు వరుసగా రెండో రోజు నష్టాలు

ఆర్బీఐ మానిటరీ పాలసీ నిర్ణయాలు వెలువడనున్న క్రమంలో ఇన్వెస్టర్ల అప్రమత్తత

213 పాయింట్లు కోల్పోయిన సెన్సెక్స్

92 పాయింట్లు నష్టపోయిన నిఫ్టీ




**ముంబై:** దేశీయ స్టాక్ మార్కెట్లు వరుసగా రెండో రోజు నష్టాల్లో ముగిశాయి. అంతర్జాతీయ మార్కెట్ల నుంచి సానుకూలతలు ఉన్నప్పటికీ... ఆర్బీఐ మానిటరీ పాలసీ నిర్ణయాలు రేపు వెలువడనున్న నేపథ్యంలో ఇన్వెస్టర్లు అప్రమత్తతను పాటించారు. ఈ క్రమంలో మన మార్కెట్లు నష్టాలను మూటకట్టుకున్నాయి. ట్రేడింగ్ ముగిసే సమయానికి సెన్సెక్స్... 213 పాయింట్ల నష్టంతో 78,058కి పడిపోయింది. నిఫ్టీ 92 పాయింట్లు కోల్పోయి 23,622 వద్ద స్థిరపడింది.

**బీఎస్ఈ సెన్సెక్స్ టాప్ గెయినర్స్:**

అదానీ పోర్ట్స్ (1.72%), ఇన్ఫోసిస్ (0.94%), యాక్సిస్ బ్యాంక్ (0.71%), హెచ్సీఎల్ టెక్నాలజీస్ (0.60%), టెక్ మహీంద్రా (0.58%).

**టాప్ లూజర్స్:**

భారతి ఎయిర్ టెల్ (-2.47%), టైటాన్ (-2.28%), ఎన్టీపీసీ (-2.13%), స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (-1.79%), ఐటీసీ (-1.53%).

# టీమిండియా ఘన విజయం

వన్డేల సిరీస్‌లో టీమిండియా శుభారంభం

తొలి వన్డేలో సమిష్టిగా రాణించిన భారత్

248 పరుగులకే కుప్పకూలిన ఇంగ్లండ్

ఇంగ్లండ్ వెన్నువిరిచిన జడేజా, పేసర్ హర్షిత్ రాణా

6 వికెట్లు కోల్పోయి విజయాన్నందుకున్న టీమిండియా




**నాగ్‌పూర్:** ఇంగ్లండ్‌తో మూడు వన్డేల సిరీస్‌లో టీమిండియా శుభారంభం చేసింది. నాగ్‌పూర్ వేదికగా గురువారం జరిగిన తొలి వన్డేలో సమష్టిగా రాణించిన భారత్ 4 వికెట్ల తేడాతో ఇంగ్లండ్‌ను చిత్తు చేసింది. బౌలింగ్‌లో హర్షిత్ రాణా, జడేజా సత్తా చాటగా.. బ్యాటింగ్‌లో శుభ్‌మన్ గిల్, శ్రేయస్ అయ్యర్, అక్షర్ పటేల్ రాణించారు. ఈ మ్యాచ్‌లో ముందుగా బ్యాటింగ్ చేసిన ఇంగ్లండ్ 47.4 ఓవర్లలో 248 పరుగులకు ఆలౌటైంది. కెప్టెన్ జోస్ బట్లర్(67 బంతుల్లో 4 ఫోర్లతో 52), జాకోబ్ బెతెల్(64 బంతుల్లో 3 ఫోర్లు, సిక్స్‌తో 51) హాఫ్ సెంచరీలతో రాణించారు. భారత బౌలర్లలో రవీంద్ర జడేజా(3/26), అరంగేట్ర పేసర్ హర్షిత్ రాణా(3/53) మూడేసి వికెట్లు తీయగా.. మహమ్మద్ షమీ, అక్షర్ పటేల్, కుల్దీప్ యాదవ్ తలో వికెట్ పడగొట్టారు. అనంతరం భారత్ 38.4 ఓవర్లలో 6 వికెట్లకు 251 పరుగులు చేసి సునాయస విజయాన్నందుకుంది. శుభ్‌మన్ గిల్(96 బంతుల్లో 14 ఫోర్లతో 87 ), అక్షర్ పటేల్(47 బంతుల్లో 6 ఫోర్లు, సిక్స్‌తో 52 ) శ్రేయస్ అయ్యర్(36 బంతుల్లో 9 ఫోర్లు, 2 సిక్సలతో 59) హాఫ్ సెంచరీలతో రాణించారు. ఇంగ్లండ్ బౌలర్లలో సకీబ్ మహ్మూద్(2/47), ఆదిల్ రషీద్(2/49) రెండేసి వికెట్లు తీయగా.. జోఫ్రా ఆర్చర్, జాకోబ్ బెతెల్ తలో వికెట్ పడగొట్టారు.సూపర్ ఫీల్డింగ్‌తో ఫిల్ సాల్ట్‌ను రనౌట్ చేసిన శ్రేయస్ అయ్యర్.. బ్యాటింగ్‌లో రెండు కీలక వికెట్లు కోల్పోయిన తర్వాత దూకుడుగా ఆడి మ్యాచ్‌ను భారత్‌వైపు మలుపు తిప్పాడు. ఇంగ్లండ్ పేలవ ఫీల్డింగ్ కూడా భారత్‌కు కలిసొచ్చింది. ఈ గెలుపుతో మూడు వన్డేల సిరీస్‌లో టీమిండియా 1-0తో ఆధిక్యంలో నిలిచింది. రెండో వన్డే ఆదివారం కటక్ వేదికగా జరగనుంది. స్వల్ప లక్ష్యఛేదనకు దిగిన భారత్‌కు ఆశించిన ఆరంభం దక్కలేదు. ఓపెనర్లు యశస్వి జైస్వాల్(15), రోహిత్ శర్మ(2) తీవ్రంగా నిరాశపరిచారు. ఆర్చర్ బౌలింగ్‌లో తీవ్రంగా తడబడ్డ యశస్వి జైస్వాల్.. కీపర్ క్యాచ్‌గా వెనుదిరిగాడు. ఆ వెంటనే రోహిత్ శర్మ అనవసర షాట్‌తో వికెట్ పారేసుకున్నాడు. దాంతో భారత్ 19 పరుగులకే రెండు కీలక వికెట్లు కోల్పోయింది. ఈ పరిస్థితుల్లో క్రీజులోకి వచ్చిన శ్రేయస్ అయ్యర్, శుభ్‌మన్ గిల్ దూకుడుగా ఆడాడు. గిల్ ఆచితూచి ఆడినా.. అయ్యర్ బౌండరీలతో చెలరేగాడు. దాంతో భారత్ పవర్ ప్లేలో 2 వికెట్ల నష్టానికి 71 పరుగులు చేసింది. అనంతరం అదే జోరు కొనసాగించిన అయ్యర్ 30 బంతుల్లోనే హాఫ్ సెంచరీ పూర్తి చేసుకున్నాడు. గిల్ కూడా బ్యాట్ ఝులిపించడంతో భారత్ 14 ఓవర్లలోనే 100 పరుగులు పూర్తి చేసుకుంది. క్రీజులో ప్రమాదకరంగా మారిన ఈ జోడీని జాకోబ్ బెతెల్ విడదీసాడు. అయ్యర్‌ను ఎల్బీగా పెవిలియన్ చేర్చాడు. దాంతో మూడో వికెట్‌కు నమోదైన 94 పరుగుల భాగస్వామ్యానికి తెరపడింది. అయ్యర్ ఔటైనా.. క్రీజులోకి వచ్చిన అక్షర్ పటేల్‌తో కలిసి శుభ్‌మన్ గిల్ ఆచితూచి ఆడాడు. ఈ క్రమంలో అతను 60 బంతుల్లో హాఫ్ సెంచరీ పూర్తి చేసుకున్నాడు. మరోవైపు అక్షర్ పటేల్ తనదైన షాట్లతో ఇంగ్లండ్ బౌలర్లపై విరుచుకుపడ్డాడు. 46 బంతుల్లో అతను కూడా హాఫ్ సెంచరీ పూర్తి చేసుకున్నాడు. భారత్ విజయం లాంఛనమే అన్న పరిస్థితుల్లో అక్షర్ పటేల్‌ను ఆదిల్ రషీద్ క్లీన్ బౌల్డ్ చేశాడు. దాంతో నాలుగో వికెట్‌కు నమోదైన 108 పరుగుల భాగస్వామ్యానికి తెరపడింది. క్రీజులోకి వచ్చిన కేఎల్ రాహుల్(2) తీవ్రంగా నిరాశపరిచాడు. ఆదిల్ రషీద్‌కు రిటర్న్ క్యాచ్ ఇచ్చి వెనుదిరిగాడు. సెంచరీ చేయాలనే ఆలోచనతో దూకుడుగా ఆడిన శుభ్‌మన్ గిల్ క్యాచ్ ఔట్‌గా వెనుదిరిగాడు. హార్దిక్ పాండ్యా(9నాటౌట్)తో కలిసి జడేజా(12 నాటౌట్) విజయలాంఛనాన్ని పూర్తి చేశాడు.

ముందుగా.. రవీంద్ర జడేజా(3/26), అరంగేట్ర పేసర్ హర్షిత్ రాణా(3/53) మూడేసి వికెట్లు తీయడంతో ముందుగా బ్యాటింగ్ చేసిన ఇంగ్లండ్ 47.4 ఓవర్లలో 248 పరుగులకు కుప్పకూలింది. కెప్టెన్ జోస్ బట్లర్(67 బంతుల్లో 4 ఫోర్లతో 52), జాకోబ్ బెతెల్(64 బంతుల్లో 3 ఫోర్లు, సిక్స్‌తో 51) హాఫ్ సెంచరీలతో రాణించారు. భారత బౌలర్లలో హర్షిత్ రాణా, రవీంద్ర జడేజాతో పాటు మహమ్మద్ షమీ, అక్షర్ పటేల్, కుల్దీప్ యాదవ్ తలో వికెట్ తీసారు. యశస్వి జైస్వాల్, శ్రేయస్ అయ్యర్ సంచలన ఫీల్డింగ్‌తో ఇంగ్లండ్ పతనాన్ని శాసించారు. దూకుడు మీదున్న ఓపెనర్లను తమ ఫీల్డింగ్‌తో పెవిలియన్ చేర్చారు. టాస్ గెలిచి బ్యాటింగ్‌కు దిగిన ఇంగ్లండ్‌కు ఓపెనర్లు ఫిల్ సాల్ట్(26 బంతుల్లో 5 ఫోర్లు, 3 సిక్సలతో 43), బెన్ డకెట్(29 బంతుల్లో 6 ఫోర్లతో 32) అదిరిపోయే ఆరంభాన్ని అందించారు. విధ్వంసకర బ్యాటింగ్‌తో భారత బౌలర్లపై విరుచుకుపడిన ఈ జోడీ 6 ఓవరల్లోనే 50 పరుగులు చేసింది. ఎడాపెడా బౌండరీలు బాదుతూ వేగంగా పరుగులు చేసింది. క్రీజులో సెట్ అయిన తర్వాత అనవసరం తప్పిదంతో ఫిల్ సాల్ట్ వికెట్ పారేసుకున్నాడు. శ్రేయస్ అయ్యర్ స్టన్నింగ్ ఫీల్డింగ్‌తో రనౌట్‌గా వెనుదిరిగాడు. బౌండరీ లైన్ వద్ద అద్భుతంగా బంతిని ఆపిన అయ్యర్ వేగంగా త్రో వేసి ఫిల్ సాల్ట్‌ను పెవిలియన్ చేర్చాడు. దాంతో తొలి వికెట్‌కు నమోదైన 75 పరుగుల భాగస్వామ్యానికి తెరపడింది. హర్షిత్ రాణా మరుసటి ఓవర్‌లోనే బెన్ డకెట్..యశస్వి జైస్వాల్ స్టన్నింగ్ క్యాచ్‌కు వెనుదిరిగాడు. ఇదే ఓవర్ చివరి బంతికి హ్యారీ బ్రూక్(0) కీపర్ క్యాచ్ ఔట్‌గా పెవిలియన్ చేరాడు. దాంతో 2 పరుగుల వ్యవధిలోనే ఇంగ్లండ్ మూడు వికెట్లు కోల్పోయింది. ఆచితూచి ఆడిన జోరూల్‌ను జడేజా వికెట్ల ముందు బోల్తాకొట్టించాడు. ఈ పరిస్థితుల్లో జాకోబ్ బెతెల్‌తో కలిసి జోస్ బట్లర్ జట్టును ఆదుకున్నాడు.

# ఆర్‌సీబీ జట్టుకు భారీ ఎదురుదెబ్బ

ఆస్ట్రేలియన్ ఫాస్ట్ బౌలర్ జోష్ హేజిల్‌వుడ్ దూరం?

ఇప్పటికే ఛాంపియన్స్ ట్రోఫీ నుంచి నిష్క్రమణ




**బెంగళూరు:** రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరుకు భారీ ఎదురుదెబ్బ తగిలింది. ఐపీఎల్ 2025కి ముందు ఆ జట్టుకు ఊహించని షాక్ తగిలింది. ఐపీఎల్ వేలంలో ఆస్ట్రేలియన్ ఫాస్ట్ బౌలర్ జోష్ హేజిల్‌వుడ్‌ను ఆర్‌సీబీ జట్టు అత్యంత ఖరీదైన బౌలర్‌గా చేసి రూ.12.50 కోట్లకు కొనుగోలు చేసింది. కానీ, ఐపీఎల్ 2025కి ముందు, అతను గాయం కారణంగా శస్త్రచికిత్స చేయించుకున్నాడు. ఇటువంటి పరిస్థితిలో, అతను ఇప్పటికే ఛాంపియన్స్ ట్రోఫీ నుంచి నిష్క్రమించాడు. కానీ ఇప్పుడు ఈ బౌలర్ ఐపీఎల్ 2025 నుంచి కూడా తప్పుకోవచ్చని చెబుతున్నారు. ఈ ఆటగాడిని పొందడానికి జట్టు కోల్‌కతా నైట్ రైడర్స్, లక్నో సూపర్ జెయింట్స్, ముంబై ఇండియన్స్‌తో పోరాడింది. కానీ ఇప్పుడు గాయం, ఆ తర్వాత శస్త్రచికిత్స తర్వాత, ఈ ఆటగాడు 2025 సీజన్‌లో ఆడటం కష్టమని చెబుతున్నారు. సన్‌రైజర్స్ హైదరాబాద్‌కు నాయకత్వం వహించనున్న ఆస్ట్రేలియా కెప్టెన్ పాట్ కమ్మిన్స్ కూడా ఐపీఎల్ 2025లో ఆడే అవకాశం లేదని తెలుస్తోంది. పాట్ కమ్మిన్స్ చీలమండ గాయంతో బాధపడుతున్నాడు. ఛాంపియన్స్ ట్రోఫీలో ఆడటం అతనికి కష్టంగా అనిపిస్తుంది. ఇటువంటి పరిస్థితిలో, అతను ఛాంపియన్స్ ట్రోఫీకి దూరంగా ఉంటే, ఈ బౌలర్ కూడా ఐపీఎల్‌కు దూరంగా ఉండవచ్చు. అయితే, ఇప్పటివరకు ఏదీ స్పష్టంగా తెలియలేదు. క్రికెట్. కామ్ ఆస్ట్రేలియా నివేదిక ప్రకారం, పాట్ కమ్మిన్స్, జోష్ హేజిల్‌వుడ్ కోలుకోవడానికి చాలా సమయం పట్టవచ్చు. వారిద్దరూ పూర్తిగా ఫిట్ అయ్యే వరకు ఆడటం కష్టం. ఇటువంటి పరిస్థితిలో, వారిద్దరూ ఐపీఎల్‌లో కూడా పాల్గొనడం కష్టంగా అనిపిస్తుంది. కాలి గాయం కారణంగా హాజిల్‌వుడ్ బోర్డర్-గవాస్కర్ ట్రోఫీ రెండవ అర్ధభాగానికి దూరమయ్యాడు. గాయం కారణంగా శ్రీలంకతో జరిగిన రెండు మ్యాచ్‌ల టెస్ట్ సిరీస్‌కు కూడా అతను దూరంగా ఉన్నాడు. కానీ, ఇప్పుడు మరో గాయం అతన్ని బాధపెడుతోంది. ఇంతలో, కామెరాన్ గ్రీన్ ఇప్పటికే 2025 ను కోల్పోతున్నానని ధృవీకరించాడు. మిచెల్ మార్ష్ కూడా గాయపడి ఛాంపియన్స్ ట్రోఫీకి దూరమయ్యాడు. ఇటువంటి పరిస్థితిలో, అతను ఆడటం కష్టంగా అనిపిస్తుంది.

# జడ్డూ అద్భుత రికార్డ్




ఇంగ్లాండ్‌పై అత్యధిక వికెట్లు తీసిన బౌలర్‌గా ఘనత

**న్యూఢిల్లీ:** టీమిండియా స్టార్ రవీంద్ర జడేజా చరిత్ర సృష్టించాడు. వన్డేల్లో ఇంగ్లాండ్ పై అత్యధిక వికెట్లు తీసిన బౌలర్ గా నిలిచాడు. ప్రస్తుతం ఇంగ్లాండ్ తో జరుగుతోన్న తొలి వన్డే లో ఈ ఘతన సాధించాడు. ఈ మ్యాచ్ లో మూడు వికెట్లు తీసిన అతడు.. జాకోబ్ బెథెల్ వికెట్ పడగొట్టడంతో అత్యధిక వికెట్ల మార్క్ ను టచ్ చేశాడు. మొత్తంగా అతడు ఇంగ్లాండ్ పై ఇప్పటి వరకు 41 వికెట్లు తీశాడు. ఇంకా ఈ మ్యాచ్ లో మరో రికార్డు కూడా సాధించాడు జడేజా. అంతర్జాతీయ క్రికెట్‌లో 600 వికెట్లు తీసిన 5వ భారత బౌలర్‌గా, 4వ భారత స్పిన్నర్ గానూ ఘనత సాధించాడు. అంతర్జాతీయ క్రికెట్‌లో అనిల్ కుంబ్లే (401 మ్యాచుల్లో 953 వికెట్లు), రవిచంద్రన్ అశ్విన్ (287 మ్యాచుల్లో 765 వికెట్లు), హర్భజన్ సింగ్ (365 మ్యాచుల్లో 707 వికెట్లు), కపిల్ దేవ్ (356 మ్యాచుల్లో 687 వికెట్లు) భారత్ తరుపున అత్యధిక వికెట్లు పడగొట్టారు.మొత్తంగా ప్రస్తుతం జరుగుతోన్న మ్యాచ్‌లో 9 ఓవర్లు బౌలింగ్ చేసిన అతడు 1 మెయిడిన్ ఓవర్ వేసి.. కేవలం 26 పరుగులిచ్చి 3 వికెట్లు తీశాడు.

వన్డేల్లో ఇంగ్లాండ్ పై అత్యధిక వికెట్లు తీసింది వీరే

41 రవీంద్ర జడేజా
40 జేమ్స్ అండర్సన్
37 యాండ్రూ ఫ్లింటాఫ్
36 హర్భజన్ సింగ్
35 జవగళ్ శ్రీనాథ్, అశ్విన్.

# తొలి మ్యాచ్‌లోనే సారథిగా..

జింబాబ్వే టెస్ట్ క్రికెట్ చరిత్రలో నయా రికార్డు

జోనాథన్ కాంప్‌బెల్ టెస్టుల్లో అరంగేట్రం

అరంగేట్ర మ్యాచ్‌లోనే జాతీయ జట్టుకు కెప్టెన్‌గా ఎంపిక




**జింబాబ్వే:** జింబాబ్వే-ఐర్లాండ్ మధ్య ఏకైక టెస్టు మ్యాచ్ సిరీస్ జరగనున్న సంగతి తెలిసిందే. తాజాగా ఈ మ్యాచ్ ప్రారంభమైంది. అయితే ఈ మ్యాచ్‌లో ఓ సంచలనం నమోదైంది. ఈ మ్యాచ్ తో అరంగేట్రం చేసిన ఓ క్రికెటర్.. తన తొలి మ్యాచ్ లోనే సారథిగా వ్యవహరించడం విశేషం. ఈ మ్యాచ్‌కు కొన్ని గంటల ముందు రెగ్యులర్ కెప్టెన్ క్రెయిగ్ ఎర్విన్ తప్పుకున్నాడు. వ్యక్తిగత కారణాల వల్ల అతడు ఈ మ్యాచ్ కు దూరమయ్యాడని అక్కడి క్రికెట్ బోర్డు తెలిపింది. అయితే ఇదే సమయంలో ఈ మ్యాచ్ తో జింబాబ్వే దిగ్గజ క్రికెటర్ అలస్టెయిర్ క్యాంప్‌బెల్ తనయుడు జోనాథన్ కాంప్‌బెల్ టెస్టు అరంగేట్రం చేశాడు. అతడే ఇప్పుడు తన అరంగేట్ర మ్యాచ్‌లోనే జాతీయ జట్టుకు కెప్టెన్‌గా వ్యవహరించే అవకాశం దక్కించుకున్నాడు. అలా తన ఎంట్రీ మ్యాచ్ లోనే సారథ్య బాధ్యతలు అందుకున్న కాంప్‌బెల్.. ఓ అరుదైన ఘనతను కూడా వేసుకున్నాడు. గత 148 ఏళ్లలో.. జింబాబ్వే టెస్ట్ క్రికెట్ చరిత్రలో తండ్రి, కొడుకు.. ఇద్దరూ సారథులుగా వ్యవహరించిన తొలి ద్వయంగా నిలిచారు. మొత్తంగా టెస్ట్ క్రికెట్ చరిత్రలో తండ్రి, కొడుకు.. ఇద్దరూ సారథులుగా వ్యవహరించిన నాలుగో ద్వయంగానూ నిలిచారు. ఇంకా అరంగేట్ర మ్యాచ్ లోనే జింబాబ్వే జట్టుకు టెస్ట్ కెప్టెన్‌గా ఎంపికైన రెండో ప్లేయర్‌గా కాంప్‌బెల్ ఘనత సాధించాడు. అంతకుముందు దిగ్గజ క్రికెటర్ డేవ్ హౌటన్.. 1992లో హరారే వేదికగా టీమిండియాతో జరిగిన ఓ టెస్టు మ్యాచ్ లో జింబాబ్వే సారథిగా వ్యవహరించాడు. గత 50 ఏళ్లలో ఇలాంటి ఘతన అందుకున్న మూడో ప్లేయర్ గా నిలిచాడు. 21వ శతాబ్దంలో అరంగేట్రంలోనే టెస్టు కెప్టెన్‌గా వ్యవహరించిన ఐదో ప్లేయర్‌గానూ జోనాథన్ రికార్డు సాధించాడు. ఈ 21 శతాబ్దంలో అతడి కన్నా ముందు న్యూజిలాండ్ మాజీ క్రికెటర్ లీ జెర్మెన్ (1995లో), నైమూర్ రెహమాన్ (2000లో బంగ్లాదేశ్), విలియం పోర్టర్‌ఫీల్డ్ (2018లో), అస్గర్ ఆఫ్ఘన్ (2018లో) ఈ ఘనత సాధించారు. జోనాథన్ కు ఫస్ట్ క్లాస్ క్రికెట్‌లో మంచి రికార్డే ఉంది. 34 ఫస్ట్ క్లాస్ మ్యాచ్‌లు ఆడిన అతడు 1,913 పరుగులు చేశాడు. అందులో నాలుగు సెంచరీలు ఉన్నాయి. బౌలింగ్‌లోనూ 42 వికెట్లు తీశాడు.




## లవ్‌యాపా అంటూ వస్తోన్న ఖుషీ కపూర్

టాకీస్: 'లవ్‌యాపా' అంటూ యూత్‌ఫుల్ లవ్‌స్టోరీతో పలకరించనున్నారు ఖుషీ కపూర్. ఆమె ప్రధానపాత్రలో నటించిన ఈ చిత్రం ఫిబ్రవరి 7న విడుదల కానుంది. తాజాగా ఈ చిత్రబృందానికి విషెస్ చెప్పిన జాన్వీకపూర్ తన చెల్లి ఖుషీని చూస్తుంటే గర్వంగా ఉందన్నారు. 'ఎంత కష్టమైనప్పటికీ నీకు నచ్చిన దాన్ని చాలా నిజాయితీగా, శ్రద్ధగా చేస్తున్నందుకు నిన్ను చూస్తుంటే ఎంతో గర్వంగా ఉంది ఖుషీ. వినోదం, హాస్యంతో పాటు ఎమోషనల్ సన్నివేశాలతో కూడిన ఈ రొమాంటిక్ కామెడీ చిత్రం 7 నుంచి అన్ని థియేటర్‌లలో సందడి చేస్తుంది. నేను ఈ సినిమా చూసి కచ్చితంగా భావోద్వేగానికి గురవుతాను. ఎందుకంటే ఎమోషనల్ సీన్స్‌లలో నా ఖుషీ ఏడవడం బిగ్‌స్క్రీన్‌పై చూసినప్పుడు తట్టుకోలేను' అని రాసుకొచ్చారు. 'లవ్‌యాపా' స్పెషల్ టీ షర్ట్ వేసుకున్న జాన్వీ.. తన సినిమాల విడుదల తేదీలలో ఖుషీని కూడా తన ఫొటో ఉన్న టీ షర్ట్ ధరించాలని కోరారు. 2023లో 'ది ఆర్చిస్'తో హీరోయిన్‌గా ఇండస్ట్రీకి ఎంట్రీ ఇచ్చారు ఖుషీ కపూర్ . ఆ చిత్రంతో ప్రశంసలు అందుకున్నారు. ఇప్పుడు 'లవ్‌యాపా' అంటూ పలకరించేందుకు సిద్ధమయ్యారు. ప్రదీప్ రంగనాథన్ స్వీయ దర్శకత్వంలో తమిళంలో సూపర్‌హిట్ అందుకున్న చిత్రం 'లవ్ టుడే' . నేటితరం యువతీ యువకుల ప్రేమకథతో దీనిని రూపొందించారు. ఇప్పడిదే చిత్రానికి రీమేక్‌గా 'లవ్‌యాపా' సిద్ధమైంది. అద్వైత్ చందన్ దర్శకత్వం వహించారు. ప్రదీప్ రంగనాథన్ నిర్మాతగా వ్యవహరించారు.

## రాయల్ ప్రిన్సెస్ ఆలియా భట్ సొగసు

టాకీస్: చుట్టూ రాయల్ యాంబియెన్స్.. అక్కడ ఓ అందమైన యువరాణి. ఎవరి కోసమో ఎదురు చూస్తోంది. రాజ ప్రాకారంలో రాకుమారి.. తన్మయంగా.. ఆద మరపుగా.. మైమరిపించేలా.. ఆ రూపం ముగ్ధ మనోహరం.. యాంబియెన్స్ కి తగ్గట్టే రాచరికం ఉట్టిపడుతోంది. ఇంతకీ ఎవరీ బ్యూటీ..? అంటే పరిచయం అవసరం లేదు. ది ఛామింగ్ ప్రిన్సెస్ ఆలియాభట్.. అందంతో ఎక్స్‌ప్రెషన్స్ తో, ఎంపిక చేసుకున్న డిజైనర్ లుక్ తో ఆలియా అందరి కళ్లను తనవైపు తిప్పేసుకుంది. కెరీర్‌లో ఎన్నో విలక్షణమైన రూపాల్లో కనిపించినా ఇది నిజంగా యూనిక్ లుక్ అని ప్రశంసిం చి తీరాలి. ఒక కార్పొరెట్ ప్రకటన కోసం తాజా ఫోటోషూట్ లో అలియా భట్ ఇలా మెస్మరైజ్ చేసింది. 31 ఏళ్ల ఆలియా అందం చందం అపురూపమైన ఎక్స్‌ప్రెషన్ ప్రతిదీ ఎంతో ఆకట్టుకుంటు న్నాయి. ముఖ్యంగా ఫోటోషూట్ కోసం ఎంపిక చేసుకున్న నేపథ్యం రాయల్ లుక్, డిగ్నిటీ, భారీతనం ఆకర్షిస్తున్నా యి. డిస్నీ యువరాణి సొగసు ఇది అంటూ అభిమానులు ఆలియాను చూసి మురిసిపోతున్నారు. మెరిసే గోల్డ్ కలర్ గౌన్.., థై స్లిట్ ఫ్రాక్.., భారీ లెహంగా... ఇలా రకరకాల డిజైనర్ దుస్తుల్లో ఆలియాపై ఈ ప్రత్యేక ఫోటోషూట్ ని చేసారు. ప్రతి లుక్ దేనికదే ప్రత్యేకం. సెలబ్రిటీ ఫ్యాషన్ డిజైనర్ రియా కపూర్ ఆలియాకు స్టైలింగ్ చేసారు. రియా ప్రముఖ కథానాయిక సోనమ్ కపూర్ సోదరి, అగ్ర హీరో అనీల్ కపూర్ కుమార్తె అన్న సంగతి తెలిసిందే. అబు జానీ సందీప్ ఖోస్లా కస్టమ్-డిజైన్ నుంచి బంగారు గౌనును ఈ ఫోటోషూట్ కోసం ఆలియా ధరించింది. ఈ డిజైనర్ దుస్తుల్లో జరీ ఎంబ్రాయిడరీ, షిమ్మరీ మెరపులు.. సీక్విన్ అలంకరణలు ప్రతిదీ డ్రమటిక్ గా ఆకర్షిస్తున్నాయి. ఆలియా డిజైనర్ లుక్స్ ప్రస్తుతం ఇంటర్నెట్ లో వైరల్ గా మారుతున్నాయి. అభిమానులు 'దేశీ సిండ్రెల్లా' అని ప్రశంసలు కురిపిస్తున్నారు. యువరాణి అంటూ కొందరు కీర్తిస్తున్నారు. ఆలియా తదుపరి ఆల్ఫా, లవ్ అండ్ వార్ చిత్రాల్లో నటిస్తోంది. ఆల్ఫా లో గూఢచారి పాత్రతో స్టన్ చేయబోతోంది.




## మాలీవుడ్‌లోనూ ఒత్తిడి షరా మామూలే

మలయాళ స్టార్ హీరో పృథ్వీరాజ్ సుకుమారన్



**టాకీస్:** ఈ మధ్యకాలంలో స్టార్ హీరోలు టాలీవుడ్ సినిమాల్లోకి ఎంట్రీ ఇచ్చి మంచి గుర్తింపు సంపాదించు కుంటున్నారు. ఇందులో మలయాళ స్టార్ హీరో పృథ్వీరాజ్ సుకుమారన్ ఒకరు. 'సలార్' మూవీలో ప్రభాస్‌తో సమానంగా నటించి తెలుగులో తిరుగులేని పాపులారిటి దక్కించుకున్నాడు. తాజాగా స్వీయ దర్శకత్వంలో 'లూసిఫర్2: ఎంపురాన్' మూవీలో నటిస్తున్నాడు పృథ్వీరాజ్. ఇందులో మోహన్‌లాల్ కథానాయకుడిగా నటించాడు. ఈ చిత్రం మార్చి 27న ప్రేక్షకుల ముందుకు రానుంది. కాగా ఈ సినిమా కోసం ప్రమోషన్

భారీగానే చెస్తున్నారు మూవీ టీం. ఇందులో భాగంగా ఓ ఇంటర్వ్యూలో పాల్గోన్న పృథ్వీరాజ్ సుకుమారన్ మలయాళ ఇండస్ట్రీలో ఒత్తిడి గురించి వైరల్ కామెంట్స్ చేశాడు.. చాలా వరకు మిగతా ఇండస్ట్రీలలో ఉన్నంతగా ఓతిడి మాలీవుడ్ లో ఉండదు అంటారు నిజమా? అని ప్రశ్నించడంతో పృథ్వీరాజ్ స్పందిస్తూ.. ' మిగతా ఇండస్ట్రీల లాగే మలయాళంలో కూడా సినిమాకి లాభాలు రావడానికి చాలా ఒత్తిడి ఉంటుంది. అంత ఒత్తిడిలో కూడా మాలీవుడ్ గొప్ప సినిమాలు అందిస్తోంది. కానీ మంచి కథలు కాకపోతే ప్లాప్ అవ్వడం కాయం అని ప్రేక్షకులు ఇప్పటికే ఎన్నోసార్లు నిరూపించారు. ఈ విషయంలో వాళ్లకు కృతజ్ఞతలు చెప్పాలి. ఎందుకంటే ఈ కారణంగా గత కొంత కాలంగా నటీనటులు ఎవరు? దర్శకుడు ఎవరు? అనే దానితో సంబంధం లేకుండా మంచి సినిమాలు భారీ కలెక్షన్లను సొంతం చేసుకుంటున్నాయి. మేము విజయం సాధించాం అనడానికి ఇదే నిదర్శనం. కథ బాగుంటే హీరో ఎవరనేదానితో సంబంధం లేకుండా మూవీ హిట్ అవుతాయి. అందుకే మంచి కథను ఎంచుకుంటే ప్రేక్షకులు ఆదరిస్తారనే నమ్మకంతో ఉన్నాం. మన పనికి మనం కట్టుబడి ఉంటే తర్వాత ఫలితాన్ని ప్రేక్షకులే అందిస్తారు' అని పృథ్వీరాజ్ సుకుమారన్ తెలిపాడు.

## అందరూ దయతో ఉండండి

రష్మిక ఇంట్రెస్టింగ్ పోస్ట్




టాకీస్: ఎప్పుడూ సోషల్ మీడియాలో యాక్టివ్‌గా ఉండే రష్మిక తాజాగా పెట్టిన పోస్ట్ వైరల్‌గా మారింది. తన సినిమా విశేషాలు పంచుకునే ఆమె తాజాగా దయగా ఉండండి అంటూ పోస్ట్ పెట్టారు. 'ఈ రోజుల్లో అందరిలో దయ తగ్గిపోతోంది. నేను మాత్రం అందరినీ ఒకేలా చూస్తాను. మీరంతా కూడా అలానే ఉండండి. ఒకరిపై ఒకరు దయతో ఉండండి' అని రాసుకొచ్చారు. తాను ధరించిన టీ షర్ట్ మీద కూడా దయ అనే రాసి ఉంది. దీంతో ఈ పోస్ట్‌పై నెటిజన్లు కామెంట్స్ పెడుతున్నారు. తాజాగా రష్మిక, విజయ్ దేవరకొండ జిమ్‌లో కలిసి కనిపించిన వీడియో వైరలైన విషయం తెలిసిందే. అయితే, జిమ్‌లో నుంచి బయటకు వచ్చిన విజయ్ కారులో కూర్చోగా.. రష్మిక కాలికి ఉన్న గాయం కారణంగా ఇబ్బందిపడుతూ కారు ఎక్కారు. ఈ వీడియోపై కొందరు విజయ్‌ను విమర్శిస్తున్నారు. రష్మికకు సాయం చేయొచ్చు కదా అంటూ కామెంట్స్ చేస్తున్నారు. ఈ నేపథ్యంలో రష్మిక పోస్ట్ వైరల్‌గా మారింది. ఇక సినిమాల విషయానికొస్తే.. ప్రస్తుతం రష్మిక నటించిన ఛావా విడుదలకు సిద్ధమైంది. ఛత్రపతి శివాజీ మహరాజ్ కుమారుడు శంభాజీ మహరాజ్ జీవితాధారంగా రూపొందుతున్న చిత్రమే 'ఛావా'. శంభాజీ మహరాజ్‌గా విక్కీ కౌశల్, ఆయన భార్య పాత్రలో రష్మిక నటించారు. ఫిబ్రవరి 14న సినిమా ప్రేక్షకుల ముందుకురానుంది. దీనితో పాటు సల్మాన్ ఖాన్ సరసన 'సికందర్'లో నటిస్తున్నారు. ఏఆర్ మురుగదాస్ దర్శకత్వంలో ఇది రానుంది. అలాగే వీటితో పాటు 'థామ', 'కుబేర', 'ది గర్ల్‌ఫ్రెండ్', 'రెయిన్ బో' చిత్రాలతోనూ రష్మిక బిజీగా ఉన్నారు.

## బలగం వేణు..ఎల్లమ్మకు సర్వం సిద్ధం

**టాకీస్:** బలగం సినిమాతో దర్శకుడిగా మారి తోలి ప్రయత్నంలోనే సూపర్ హిట్ కొట్టి బలగం వేణుగా గుర్తింపు తెచ్చుకున్నాడు. 2023 లో విడుదలైన ఈ సినిమా ప్రశంసలతో పాటు కాసుల వర్షం కురిపించింది . వేణు ఈ చిత్రానికి గాను జాతీయ అవార్డు సైతం అందుకున్నాడు. ఇదిలా ఉండగా ఈ సినిమా రిలీజ్ అయి చాలా కాలం అవుతున్నా కూడా మరో సినిమాను పట్టాలెక్కించలేదు ఈ దర్శకుడు. బలగం సినిమాను నిర్మించిన దిల్



రాజు బ్యానర్ లోనే తన రెండవ సినిమా చేయాల్సి ఉంది.అయితే ఈ కథ అందరి చుట్టూ తిరిగి నైల్‌గా యంగ్ హీరో నితిన్ దగ్గరకు వచ్చి చేరింది. పలు మార్పులతో మొత్తానికి ఈ సినిమా అక్కడ ఓకే అయింది. ఈ కథకు నిర్మాత దిల్ రాజు ఇప్పటికే యల్లమ్మ అనే టైటిల్ ను రిజిస్టర్ చేసి ఉంచారు. ప్రస్తుతం నితిన్ చేస్తున్నరాబిన్ హుడ్, తమ్ముడు సినిమాలు చివరి దశ షూట్ లో ఉన్నాయి. ఇక ఇప్పుడు వేణు దర్శకత్వంలో ఎల్లమ్మ సినిమాను సెట్స్ పైకి తీసుకెళ్లేందుకు రెడీ అవుతున్నాడు నితిన్. కాగా ఈ సినిమాను ఫిబ్రవరి ఎండింగ్ లేదా మార్చ్ లో ముహూర్తం పూజ ఉండనుందట. ఏప్రిల్ లేదా మే నుండి షూటింగ్ మొదలు కానుంది. నితిన్ ను సరికొత్తగా చూపించేందుకు కొత్త మెకోవర్ ట్రై చేస్తున్నాడు దర్శకుడు వేణు యెల్దండి. దాదాపు రెండేళ్లుగా ఈ కథ మీద కసరత్తులు చేస్తున్న వేణు ఈ సినిమాతో నితిన్ కు ఎంత పెద్ద హిట్ ఇస్తాడో చూడాలి.

Printed , Published & Owned by GADDAMEDI BALARAJU, Printed, at YAGNA PRINTERS AND PUBLICATIONS # 18-105/4,Opp:SBI,Hanumanpet,Malkajgiri (M),Medchal-Malkajgiri District,Telangana State-500047 And Publishedat H. NO: 4-54-246,.Maqdum Nagar, Jagathgirigutta,IDA Jeedimetla,Balanagar Township,Medchal-Malkajgiri ,Telangana-500037 Editor : GADDAMEDI BALARAJU Cell: 9848802025 RNI.No. APTEL/2009/29786.